ప్రజాశక్తి

శుక్రవారం 16 ఫిబ్రవరి 2024

8 పేజీలు

విశాఖపట్నం

అనకాపల్లి

నేడు కార్మిక, కర్షక సమ్మె

- మండల కేంద్రాల్లో రైతుల నిరసన ప్రదర్శనలు
- విశాఖ నగరం, అనకాపల్లి పట్టణంలో ర్యాలీలు, సభలు
- ప్రజా వ్యతిరేక విధానాలపై ఉద్యమ హోరు

సమ్మె సన్నద్ధంగా గురువారం హెచ్‌పిసిఎల్ గేటు వద్ద నిర్వహించిన కార్యక్రమంలో వందలాది మంది కార్మికులను ఉద్దేశించి మాట్లాడుతున్న సిఐటియు విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

అఖిల భారత కార్మిక సంఘాలు, సంయుక్త కిసాన్ మోర్చా ఇచ్చిన పిలుపులో భాగంగా శుక్రవారం అనకాపల్లి, విశాఖపట్నం జిల్లాల్లో కార్మికుల సమ్మె జరుగనుంది. గ్రామీణ ప్రాంతంలోని మండల కేంద్రాల్లో ర్యాలీలు, సభలు జరగనున్నాయి. కేంద్ర బిజెపి ప్రభుత్వ కార్మిక, రైతాంగ, ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా జరగనున్న ఈ సమ్మెలో కార్మికులు, రైతులు, వ్యవసాయ కార్మికులు, ఉద్యోగులు భాగస్వాములు కానున్నారు. సమ్మె విజయవంతం కావడానికి అనేక రోజులుగా సంఘ నాయకులు పరిశ్రమించారు. పరిశ్రమలకు సమ్మె నోటీసులు అందజేసి, సమ్మె కారణాలను కార్మికులకు విడమర్చి వివరించారు. కార్మికులు, రైతులకు కరపత్రాలు పంపిణీ చేశారు. గ్రూపు మీటింగ్‌లు పెట్టారు. బైక్ ర్యాలీలు నిర్వహించారు. మోడీ ప్రభుత్వ ప్రమాదకర విధానాలను చాటిచెప్పారు. వాటిపై పోరాడి ప్రతిఘటించి, అడ్డుకోకపోతే వచ్చే నష్టాలను తెలియజేశారు. ప్రభుత్వరంగ సంస్థలను ప్రయివేటీకరించి, సహజ వనరులను కార్పొరేట్ శక్తులకు కేంద్రంలోని మోడీ సర్కారు ఎలా దోచిపెడుతుందో వివరించారు.

ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణకై..

స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా 1100 రోజులుగా కార్మికుల పోరాటం జరుగుతోంది. మోడీ ప్రభుత్వం ప్రయివేటు వ్యక్తుల చేతిలో స్టీల్‌ప్లాంట్‌ను పెట్టాలని చేస్తున్న ప్రయత్నాలు, కుట్రలను కార్మికులు తిప్పికొడుతూ వస్తున్నారు. స్టీల్‌ప్లాంట్ వ్యతిరేక మిగతా 2లో..



వికలాంగులకు ట్రై సైకిళ్లు అందజేస్తున్న మంత్రి పర్షోత్తం రూపాల

వికలాంగుల సంక్షేమానికి కృషి

కేంద్ర మంత్రి పర్షోత్తం రూపాల

విశాఖలో 1589 మంది విభిన్న ప్రతిభావంతులకు ఉపకరణాల పంపిణీ

ప్రజాశక్తి - సీతమ్మధార, ఎంవిపి.కాలనీ, కలెక్టరేట్ విలేకరులు

వికలాంగుల సంక్షేమానికి కృషి చేస్తున్నట్టు కేంద్ర మత్స్య, పశుసంవర్ధక, డెయిరీ శాఖ మంత్రి పర్షోత్తం రూపాల పేర్కొన్నారు. ఎడిఐపి పథకం కింద గురువారం విశాఖలోని కైలాసపురం డిఎల్‌బి గ్రౌండ్‌లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త ఆధ్వర్యంలో సామాజిక అధికారిత శిబిర్ పేరుతో నిర్వహించిన వికలాంగులకు ఉపకరణాల పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వికలాంగులకు అందరూ ఆదరువుగా నిలవాల్సి ఉందన్నారు. రూ.2.25 కోట్లతో 2,925 పరికరాలను అలింకో సంస్థ ఆధ్వర్యంలో తయారు చేయగా 1,589 మంది వికలాంగులకు మంత్రి వాటిని అందజేశారు. కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు జివిఎల్. నర్సింహారావు, విభిన్న ప్రతిభా వంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఎమ్‌డి కుమార్ రాజా, జిల్లా జాయింట్ కలెక్టర్ కె.మయూర్ మిగతా 2లో..

పకడ్బందీగా టెన్త్, ఇంటర్ పరీక్షలు

వార్త 2లో..

వంశీ కుటుంబానికి న్యాయం చేయాలి

వార్త 5లో..

కొనసాగిన ఉద్యోగుల నిరసన

వార్త 2లో..

వాలంటీర్ వ్యవస్థ దేశానికే ఆదర్శం

- రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్
- పలువురికి సేవా మిత్ర, రత్న, వజ్ర పురస్కారాలు అందజేత

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : రాష్ట్రంలోని వాలంటీర్ వ్యవస్థ దేశానికే ఆదర్శమని, ఈ వ్యవస్థ ద్వారా రాష్ట్ర ప్రజలకు మరిన్ని ప్రయోజనాలు చేకూరాలని రాష్ట్ర పరిశ్రమలు, ఐటి శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ఆకాంక్షించారు. ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య నిస్వార్థంగా సేవలు అందిస్తున్న ఉత్తమ గ్రామ, వార్డు సచివాలయ వాలంటీర్లకు సేవా మిత్ర, సేవా రత్న, సేవా వజ్ర పురస్కారాల ప్రదానోత్సవ కార్యక్రమం గురువారం సాయంత్రం విశాఖ నగరంలోని విఎంఆర్‌డిఎ చిల్డ్రన్స్ ఎరీనాలో జరిగింది. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ జిల్లాలో 10,817 మంది వాలంటీర్లను సేవా వజ్ర, సేవా రత్న, సేవా మిత్ర బిరుదులతో సన్మానిస్తున్నట్టు తెలిపారు. ఏ ఒక్కరి సిఫార్సు లేకుండా కేవలం చేసిన పనులను మాత్రమే గుర్తించి అవార్డులను ఇస్తున్నట్లు పేర్కొన్నారు. అనంతరం 32 మందికి సేవా వజ్ర, 115 మందికి సేవా రత్న, 10,670 మంది వాలంటీర్లకు సేవా మిత్ర పురస్కారాలను ప్రకటించి నగదు పారితోషికం, పతకం, ధ్రువీకరణ పత్రం అందజేశారు. దుశ్శాలువతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, శాసనసభ్యులు ముత్తంశెట్టి శ్రీనివాసరావు, శాసనమండలి సభ్యులు వరుదు కళ్యాణి, జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున, నెడ్ క్యాప్ మాజీ చైర్మన్ కెకె.రాజు, డిప్యూటీ మేయర్లు జియ్యాని శ్రీధర్, మిగతా 2లో..

పురస్కారాలు అందుకున్న వారితో మంత్రి అమర్‌నాథ్ తదితరులు

మిలాన్‌కు పటిష్ట ఏర్పాట్లు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఈ నెల 19 నుంచి 27వ తేదీ వరకు రెండు ఫేజ్‌లుగా విశాఖ బీచ్ రోడ్డులో నిర్వహించనున్న మిలాన్-2024కు సంబంధించిన ఏర్పాట్లును నగరంలోని పలు శాఖల ఉన్నతాధికారులు గురువారం సాయంత్రం పరిశీలించారు. భద్రతా చర్యలను సమీక్షించారు. పటిష్ట ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో సిటీ పోలీసు జాయింట్ కమిషనర్ కె.ఫకీరప్ప, జివిఎంసి కమిషనర్ సిఎం.సాయికాంత్ వర్మ, పలు శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

Mrs. MARIADAS SCHOOL

Annamma Colony: Sriharipuram: Visakhapatnam - 530011

ADMISSION NOTICE

Application forms for admission to LKG to Std Vth for the academic year 2024-2025 are being issued from February 16th - 2024 from the School Office, Annamma Colony, Sriharipuram.

CORRESPONDENT

మొదటి పేజీ తరువాయి..

నేడు కార్మిక, కర్షక సమ్మె

పోరాటంలో భాగంగా కార్మికులు శతశాతం ఈ సమ్మెలో పాల్గొననున్నారు. ప్రభుత్వరంగ సంస్థలు షిప్‌యార్డు, డాక్‌యార్డు హెచ్‌పిసిఎల్‌లో అందరూ సమ్మెకు సమాయత్తమయ్యారు. బిఎస్‌ఎన్‌ఎల్ ఇతర సంస్థల్లో సమ్మె జరగనుంది.

పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను కార్పొరేట్ల ఆర్థిక ప్రయోజనాల కోసం మోడీ ప్రభుత్వం మార్పింది. కార్మిక చట్టాల స్థానంలో నాలుగు లేబర్ కోడ్‌లు తెచ్చింది. కనీస వేతనాలు, పిఎఫ్, ఇఎస్‌ఐ వంటి సదుపాయాలు కల్పనకు పోరాడే హక్కు కార్మికులు కోల్పోయే ప్రమాదం ముంచుకొచ్చింది. 12 గంటల పని విధానం ప్రవేశపెట్టడానికి కేంద్రం ప్రయత్నిస్తోంది. యుపిఎ ప్రభుత్వంలో వామపక్షాల ఒత్తిడితో సాధించుకున్న గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేస్తోంది. బడ్జెట్ కేటాయింపుల్లో కోతపెట్టి వ్యవసాయ కూలీల పనిదినాలు తగ్గిస్తోంది. వ్యవసాయోత్పత్తులకు మద్దతు ధర కల్పించి రైతును ఆదుకోవాలన్న స్వామినాథన్ కమిషన్ సిఫార్సులను సమాధి చేస్తోంది. విద్యుత్‌రంగ ప్రయివేటీకరణ నిలిపివేయాలన్న రైతుల డిమాండ్‌ను పెడచెవినపెడుతోంది. మోడీ నాయకత్వంలోని బిజెపి ప్రభుత్వ కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టకపోతే వచ్చే ముప్పును గుర్తించిన కార్మిక, రైతు సంఘాలు సమ్మెకు, గ్రామీణ బంద్‌కు పిలుపునిచ్చాయి. నూతన వాహన చట్టాన్ని రద్దు చేయాలని నగరంలో ఆటోలు, లారీ ఆపరేటర్లు బంద్ చేయనున్నారు. ఈ బంద్‌లో ఆలిండియా రోడ్ ట్రాన్స్‌పోర్టు వర్కర్సు ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి ఆర్.లక్ష్మయ్య పాల్గొననున్నారు.

ఎక్కడికక్కడ ర్యాలీలు

సమ్మెలో భాగంగా విశాఖ నగరంలోని సరస్వతీ పార్కు నుంచి జివిఎంసి గాంధీ విగ్రహం వరకు, తగరపువలస, పెందుర్తి, గాజువాక ప్రాంతాల్లో కార్మిక ర్యాలీలు, సభలు జరగనున్నాయి. స్టీల్‌ప్లాంట్ ప్రాంతంలో జరిగే ర్యాలీ, సభకు సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు హాజరుకానున్నారు. మండల కేంద్రాల్లో నిరసన ప్రదర్శనలు జరగనున్నాయి. అనకాపల్లిలో ఆర్‌టిసి కాంప్లెక్స్ నుంచి నాలుగు రోడ్ల కూడలి వరకు ఎడ్లబళ్లు, ట్రాక్టర్లతో రైతులు, కార్మికులు ర్యాలీ, సభ నిర్వహించనున్నట్లు సిఐటియు విశాఖపట్నం, అనకాపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శులు ఆర్‌కెఎస్‌వి కుమార్, జి.కోటేశ్వరరావు తెలిపారు.

వికలాంగుల సంక్షేమానికి కృషి

అశోక్, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

మత్స్య పరిశ్రమ అభివృద్ధికి తోడ్పాటు

దేశవ్యాప్తంగా మత్స్య పరిశ్రమ అభివృద్ధిపై కేంద్రం దృష్టి సారించిందని మంత్రి పర్షోత్తం రూపాల అన్నారు. నీతి ఆయోగ్, ఎపి రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో విశాఖలోని గ్రీన్ పార్క్ హోటల్‌లో రెండు రోజులు పాటు 'లోతట్టు రాష్ట్రాల మత్స్య సంపదను వినియోగం' అంశంపై తలపెట్టిన సదస్సును ఆయన ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో నీతి ఆయోగ్ సీనియర్ అడ్వైజర్ డాక్టర్ నీలం పటేల్, ఎపి ప్రభుత్వ ఆక్వా డెవలప్‌మెంట్ అథారిటీ కో వైస్ చైర్మన్ వడ్డి రఘురాం, రాజ్యసభ సభ్యులు జివిఎల్.నరసింహారావు, మత్స్యశాఖ జెడి ఎస్‌కె.లాల్ ముహమ్మద్ మాట్లాడారు. సదస్సులో ఆంధ్రప్రదేశ్, కేరళ, ఉత్తరాఖండ్, బీహార్, అస్సాం, జార్ఖండ్, ఛత్తీస్‌గఢ్, ఉత్తర ప్రదేశ్, కర్ణాటక, తెలంగాణ, పంజాబ్, హర్యానా రాష్ట్రాల ప్రతినిధులు పాల్గొన్నారు.

వయోశ్రీ యోజనతో మేలు

రాష్ట్రీయ వయోశ్రీ యోజన పథకం ద్వారా వయో వృద్ధుల జీవితాల్లో సంతోషాలను నింపేందుకు కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి పర్షోత్తం రూపాల అన్నారు. గ్రాండ్ బే హోటల్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ వయో వృద్ధుల అవసరాల మేరకు కళ్లద్దాలు, వీల్ చైర్లు, వినికిడి మిషన్లు, కృత్రిమ దంతాలు, ట్రైపాడ్, ఊతకర్ర తదితరాలను ఉచితంగా అందజేయనున్నట్లు తెలిపారు.

వాలంటీర్ వ్యవస్థ దేశానికే ఆదర్శం

కటుమూరి సతీష్, జివిఎంసి కమిషనర్ సిఎం.సాయికాంత్ వర్మ, అడిషనల్ కమిషనర్ కెఎస్.విశ్వనాథన్ పాల్గొన్నారు.

అనకాపల్లిలో..

అనకాపల్లి : జిల్లాలో వాలంటీర్లు అందిస్తున్న సేవలు మూలంగా లబ్ధిదారులందరూ సకాలంలో పథకాలను పొందగలుగుతున్నారని జిల్లా కలెక్టర్ రవి పట్టన్ శెట్టి ప్రశంసించారు. గురువారం కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన వాలంటీర్ల పురస్కార ప్రదానోత్సవంలో ఆయన జిల్లాలోని ఏడు నియోజకవర్గాలకు చెందిన 9223 మంది వాలంటీర్లను సేవా వజ్ర, సేవా రత్న, సేవామిత్ర అవార్డులతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో గవర కార్పొరేషన్ చైర్మన్ బొడ్డేడ ప్రసాద్, డిఆర్‌డిఎ పీడీ శచీదేవి, డిఎల్‌డిఒ అరుణశ్రీ, అనకాపల్లి ఎంపిపి జి.సూరిబాబు పాల్గొన్నారు.

40వ రోజుకు ఎంవివి పాదయాత్ర

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : తూర్పు నియోజకవర్గంలో విశాఖ ఎంపీ వైసిపి తూర్పు నియోజకవర్గం సమన్వయకర్త ఎంవివి.సత్యనారాయణ పాదయాత్ర గురువారానికి 40వ రోజుకు చేరుకుంది. జివిఎంసి 22వ వార్డు శివాజీపాలెం, ఆరు కుళాయిల వారి వీధి ప్రాంతాలలో వైసిపి వార్డు ఇన్‌ఛార్జి పీతల గోవిందుతో కలిసి ఈ పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంవివి మాట్లాడుతూ పేదల సంక్షేమమే ధ్యేయంగా జగన్ పాలన సాగిస్తున్నారని తెలిపారు.

పకడ్బందీగా టెన్త్, ఇంటర్ పరీక్షలు

జెసి మయూర్ అశోక్

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : టెన్త్, ఇంటర్ పరీక్షలను పకడ్బందీ ఏర్పాట్లు నడుమ నిర్వహించనున్నట్టు విశాఖ జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ తెలిపారు. మార్చి 1 నుంచి 20 వరకు ఇంటర్, 18 నుంచి 30 వరకు టెన్త్ పరీక్షల నిర్వహణపై గురువారం అధికారులతో కలెక్టర్ కార్యాలయ వీడియో కాన్ఫరెన్స్ హాలులో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో జరగనున్న పదో తరగతి, ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలను ఎలాంటి లోటుపాట్లు లేకుండా పకడ్బందీగా నిర్వహించేందుకు అధికారులందరూ సమన్వయంతో పని చేయాలని ఆదేశించారు. జిల్లాలో మార్చి 1 నుంచి 20వ తేదీ వరకు ఇంటర్మీడియట్ థియరీ, ప్రాక్టికల్ పరీక్షలు, మార్చి 18 నుంచి 30వ తేదీ వరకు 10వ తరగతి పరీక్షలు జరగనున్నాయని తెలిపారు. 10వ తరగతి పరీక్షలకు మొత్తం 31,379 మంది హాజరవుతున్నారని, వారిలో రెగ్యులర్ విద్యార్థులు 28,367 మంది, ప్రైవేట్ విద్యార్థులు 3,012 మంది ఉన్నారని చెప్పారు. రెగ్యులర్ విద్యార్థుల్లో 14,972 మంది బాలురు, 13,294 మంది బాలికలు ఉన్నట్లు తెలిపారు. అలాగే ప్రథమ సంవత్సర ఇంటర్మీడియట్ పరీక్షలకు 40,873 మంది విద్యార్థులు, ద్వితీయ ఏడాదికి 41,806 మంది విద్యార్థులు హాజరుకానున్నారని వివరించారు. జిల్లా వ్యాప్తంగా 138 పరీక్ష కేంద్రాల్లో పదో తరగతి పరీక్షలు జరగనుండగా, 93 కేంద్రాల్లో ఇంటర్ పరీక్షలు జరగనున్నట్లు వెల్లడించారు. 10వ తరగతి పరీక్షలు ప్రతి రోజూ ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు, ఇంటర్ పరీక్షలు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరుగుతాయని తెలిపారు. జిల్లా సమన్వయ కమిటీ సభ్యులందరూ సమన్వయంతో పనిచేసి 10వ తరగతి, ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలను విజయవంతం చేయాలని కోరారు. నిర్ణీత సమయానికి ముందుగానే పరీక్షా కేంద్రాలకు విద్యార్థులు చేరుకునేలా అవగాహన కల్పించాలని, విద్యార్థులు ఎలాంటి ఒత్తిళ్లకూ గురికాకుండా ప్రశాంతంగా పరీక్షలు రాసే విధంగా చూడాలని కోరారు. పోలీస్ శాఖ ద్వారా పరీక్ష కేంద్రాల వద్ద గట్టి భద్రతా ఏర్పాట్లను చేయాలని, పరీక్షల సమయంలో 144 సెక్షన్ అమలు చేయాలని తెలిపారు. పరీక్షా కేంద్రాల సమీపంలో ఎక్కడా కూడా జిరాక్స్ కేంద్రాలు ఉండకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద ఇతర వ్యక్తులు ఉంటే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వైద్య ఆరోగ్య శాఖ ద్వారా పరీక్షా కేంద్రాలలో వైద్య సిబ్బందిని నియమించి ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు, మందులు, అలాగే ప్రథమ చికిత్స కేంద్రాన్ని ఏర్పాటు చేయాలన్నారు.

పరీక్షల సమయంలో నిరంతర విద్యుత్‌ను సరఫరా చేయాలని విద్యుత్తు శాఖ అధికారులకు సూచించారు. విద్యార్థులకు సరిపడా ఆర్టీసీ బస్సులను ఏర్పాటు చేయాలని ఆ శాఖ అధికారులను ఆదేశించారు. సమావేశంలో డిఇఒ ఎల్.చంద్రకళ, ఆర్ఐఒ పి.మురళీధర్, డివైఇఒ బి.రాధ, పోలీస్, జివిఎంసి, వైద్యారోగ్య, తపాలా, విద్యుత్, రవాణా శాఖ అధికారులు పాల్గొన్నారు.

విశాఖ నగరంలో నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

కొనసాగిన ఉద్యోగుల నిరసన

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : తమ డిమాండ్లను నెరవేర్చాలంటూ గురువారమూ ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల ఐక్య కార్యాచరణ వేదిక ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఆవరణలోని ఎన్‌జిఒ హోం వద్ద భోజన విరామ సమయంలో పెద్ద ఎత్తున నిరసన తెలిపారు. జెఎసి విశాఖ జిల్లా చైర్మన్ కె.ఈశ్వరరావు, ఆర్.రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

భీమునిపట్నం : 30 శాతం ఐఆర్ మంజూరు, డిఎ, పిఆర్‌సి బకాయిల విడుదల, అడిషనల్ క్వాంటమ్ ఆఫ్ పెన్షన్ పునరుద్ధరణ, హెల్త్ కార్డులు మంజూరు, అన్ని శాఖల్లో ఖాళీ పోస్టులను శాశ్వత ప్రాతిపదికన భర్తీ తదితర డిమాండ్లను నెరవేర్చాలని కోరుతూ భీమిలిలో ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలు ధరించి ఆర్‌డిఒ, తహశీల్దార్ కార్యాలయాల వద్ద నిరసన తెలిపారు. ఎపి ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల జెఎసి పిలుపు మేరకు చేపట్టిన ఈ నిరసనలో జెఎసి భీమిలి తాలూకా యూనిట్ అధ్యక్షులు ఎం.లోవరాజు, కార్యదర్శి కె.సాయిబాబా, కన్వీనర్ కె.ముత్యాలరావు, పింఛనుదారుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు టి భీమారావు, ఎం.ఆనంద రావు పాల్గొన్నారు

వెలమలకు ఎన్నికల్లో సీట్లు కేటాయించాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : రానున్న ఎన్నికల్లో వెలమ సామాజిక తరగతికి 23 అసెంబ్లీ, 5 పార్లమెంటు స్థానాలలో అన్ని రాజకీయ పార్టీలూ ప్రాధాన్యత కల్పించాలని ఆంధ్రప్రదేశ్ వెలమ కుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు చుక్క చినబాబు డిమాండ్ చేశారు. గురువారం నగరంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇప్పటికే అన్ని రాజకీయ పార్టీలకూ వినతిపత్రాలు అందజేశామన్నారు.

ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో ఆరు ఎమ్మెల్యే స్థానాలు కల్పించాలని అన్ని రాజకీయ పార్టీలను కోరుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు గంట అప్పలనాయుడు, బండారు రామకృష్ణ, కూనురెడ్డి శ్రీనివాసరావు, గుణుపూర్ రామారావు, గొట్టాపు చిన్నమనాయుడు, బొత్స వరప్రసాద్ పాల్గొన్నారు.

మహారాజశ్రీ శృంగవరపుకోట జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
O S 112/2023.

Between:
Anala Mohana Rao ......వాది
And:
Pokala Ramana ......ప్రతివాది
TO:
Pokala Ramana S/o late Appalasuri, R/o MGPV/VSPS/NTPC/H.J No. 355/B, Near Railway School, Wireless colony, Visakhapatnam. Working as Commercial Supervisor, Goods Shed (VMCW) Marripalem. PF.No. 732392, Marripalem, Visakhapatnam.

వాయిదా తే:22-02-2024ది

దావా పరిహారం నిమిత్తం మీ మీద పైన వివరించిన వ్యాజ్యము వాది తెచ్చినందువల్ల దావాకు ప్రత్యుత్తరము చెప్పుటకు **2024వ సం|| February నెల 22వ తారీకున పగలు 10-30 గంటలకు** స్వతహాగా లేక సరి అయిన భోగట్టా ఇవ్వబడిన వకీలు గారి ద్వారా గాని లేక సరి అయిన ఏజెంటు మూలముగా ఈ కోర్టులో హాజరయ్యేటట్టు యిందువల్ల మీకు ఆజ్ఞాపించడమైనది.మీ ప్రతిపాదనమునకు ఆధారముగా ఉద్దేశించి యుండే దస్తావేజులన్నింటినీ నీ యొక్క స్టేట్ మెంటు తో సహా ఆ రోజు హాజరు పరచుటకు మీకు ఉత్తరువు చేయడమైనది.

పైన చెప్పబడిన దినమందు మీరు హాజరు కాకుండా తప్పిన ఎడల మీ పరోక్షమందు పై వ్యాజ్యమును విమర్శన చేసి తీర్మానించడ మగునని మీకు తెలియజేయడమైనది.

Srungavarapukota
Date: 22-02-2024

B.TRIMURTULU
Advocate for the Plaintiff
Srungavarapukota
Vizianagaram District
Cell : 9959202348

IN THE HON'BLE COURT OF THE PRINCIPAL SENIOR CIVIL JUDGE AT: VISAKHAPATNAM
I.P. 9/2024

Between:
Sri Tokada Koti,
S/o. Late Mandesh,
Hindu, aged 55 years,
R/at D.No. 46-9-67,
Kuppilivari Veedhi, Dondaparthi,
Visakhapatnam-530040.
...Petitioner
And:
Sri Seerapu Thammayya Reddy
& 3 others ...Respondents

GENERAL NOTICE

The public are hereby informed that the above petitioner filed the above I.P.No.9/2024 on the file of the Hon'ble Principal Senior Civil Judge Court at Visakhapatnam to declare him as an insolvent and the matter stands posted to **06-03-2024** for hearing. So public are hereby informed that any objections can be raised in the above case before the Hon'ble Court on **06-03-2024** either in person or through an Advocate at **10:30 A.M.**

(By Order of the Hon'ble Court)

Y. VASANTHA KUMARI,
P. ASHOK KUMAR,
Advocates
Visakhapatnam,
Cell: 9290552390.

IN THE HON'BLE COURT OF THE VI ADDL. DISTRICT JUDGE CUM MAHILA COURT JUDGE AT: VISAKHAPATNAM
I.A.497/2019 in A.O.P.460/2018 in A.C.68/2013

Between:
Kolupuri Chandravathi & 3 others
...Applicants
And:
M/s. Shriram City Union Finance Limited, Rep. by its G.P.A. Holder Sri K.V. Ramana & 5 others
...Respondents

NOTICE

To,
R-3: M/s. Sahaswi Appaarels Private Limited,
Rep. by its Managing Director
Smt. Tirumalaraju Bhavani,
O/o. Plot No.38, E-Block, Expansion, Apparel Export, Vadlapudi, Gajuywaka, Visakhapatnam.

Please take notice that the above-named Applicant filed the above I.A.497/2019 in A.O.P.460/2018 in A.C.68/2013 petition against you and the matter stands posted to **21-02-2024** for your appearance. You are hereby required to appear before the Hon'ble Court either in person or through duly instructed Advocate on **21-02-2024** at **10:30 A.M** in the above Court to answer all material questions, failing which the matter will be heard and determined in your absence, exparte as per law.

(By Order of the Hon'ble Court)

R.S. NAIDU,
R.(S). JAYASHREE,
Advocates
Visakhapatnam,
Cell: 98493 67911

IN THE COURT OF THE V JUNIOR CIVIL JUDGE :CITY CIVIL COURTS AT HYDERABAD, TELANGANA
O.S.NO. 2711 OF 2022

BETWEEN:
M/S EUGIA PHARMA SPECIALITIES LTD
... PLAINTIFF
AND
N. SUBASS CHANDRA BOSE & OTHERS
... DEFENDANTS

TO
1) N. SUBASS CHANDRA BOSE, S/O. RAJENDIRAN, AGED 30 YEARS, OCC: PRIVATE SERVICE, F.NO. 204, NARMADA BL, OCEAN GREEN APTS, SIMON NAGAR, KURUMANNPALEM, VIZAG - 530046. A.P
DEFENDANT NO.1

Whereas the Plaintiff Company filed the above suit against you for recovery of damages/money. The above suit is posted to 06-03-2024 for your appearance. You are hereby summoned to appear either in preson or through your pleader with your defense if any at 10:30 A.M. on the above said date before the Hon'ble Court, failing which the suit will be heard and determined exparte.

(BY ORDER OF THE HON'BLE COURT)
R. CHAKRADHAR,
V. VIMALANAND
ADVOCATES
 # 6-1-295/1, IInd Floor, Padma Rao Nagar, Secunderabad-025

కబ్జాలపై కళ్లు మూసుకున్నారా..!

యథేచ్ఛగా వైసిపి నేతల ఆక్రమణలు

చోద్యం చూస్తున్న అధికారులు

ఆక్రమించి, ఫెన్సింగ్ వేసిన రైవాడ పైపులైన్ల స్థలం

ప్రజాశక్తి - పెందుర్తి : జివిఎంసి 88వ వార్డు నరవ శివారు ప్రాంతంలో రైవాడ పైపులైన్‌కు చెందిన సర్వే నంబర్ '54/డి'లోని భూమిలో అధికార వైసిపి నేతలు కంచె వేసి కబ్జా చేస్తుంటే, అటు సంబంధిత రెవెన్యూ, మంచినీటి సరఫరా అధికారులు కళ్లు మూసుకున్నట్లు వ్యవహరిస్తున్న వైనంపై తీవ్ర విమర్శలు వినిపిస్తున్నాయి. మళ్లీ ఎప్పుడైనా రైవాడ పైపులైను విస్తరించాల్సి వస్తే ప్రస్తుతకబ్జాలతో ఇబ్బంది పడే పరిస్థితి ఉంటుందని స్థానిక జనసేన నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో దీపం ఉన్నప్పుడే ఇల్లు చక్కబెట్టుకోవాలన్న రీతిలో వైసిపి నాయకులు కబ్జాలు, ఆక్రమణలకు పాల్పడుతున్నారని, వీటిని నియంత్రించాల్సిన అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. అధికారులు తక్షణమే స్పందించి తగు చర్యలు తీసుకోవాలని, లేకుంటే టిడిపి, జనసేన ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఇటువంటి కబ్జాలపై చర్యలు ఉంటాయని అప్పుడు అక్రమార్కులతోపాటు అధికారులూ బాధ్యులౌతారని హెచ్చరించారు. దీనిపై సంబంధిత అధికారుల స్పందన, చర్యలు తెలియాల్సి ఉంది.

అమర జవాన్లకు ఘననివాళి

కొవ్వొత్తులతో ర్యాలీ చేస్తున్న విద్యార్థులు

ప్రజాశక్తి -ఆనందపురం: జమ్ముకశ్మీర్ పుల్వామాలో ఉగ్రదాడిలో అమరులైన 40 మంది సిఆర్‌పిఎఫ్ జవాన్లకు ఆనందపురంలో జై జవాన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఘననివాళులర్పించారు.వెలిగించిన కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. జై జవాన్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు కుప్ప రాజశేఖర్ ఆధ్వర్యంలో భారతి విద్యానికేతన్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థులు పాల్గొని అమరులైన భరతమాత ముద్దు బిడ్డలైన జవాన్లకు జోహార్లర్పించారు. యాత సంక్షేమ సేవ సంఘం అధ్యక్షులు అంగటి రాము,కొట్టాడా సత్యమూర్తి, కుప్ప అప్పలరాజు, వైస్ ప్రెసిడెంట్ ముడసల శ్రీను, జనరల్ సెక్రెటరీ ఏమంది శ్రీనివాసరావు, కుప్ప శ్రీను, కుప్ప చెంచునాయుడు, కుప్ప సూరిబాబు, నాగల ముత్యాలు, పీతల శ్రీను ఎల్లయ్య, అప్పల రాజు, బద్రి కల్యాణ్, హరి ఫౌండేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

18న మత సమైక్యతపై సెమినార్

ప్రజాశక్తి-సీతమ్మధార: బివి ఫౌండేషన్ ఫర్ పీస్ అండ్ హార్మొనీ, ఇంటర్నేషనల్ అసోసియేషన్ ఫర్ రిలీజియస్ ఫ్రీడమ్ సంస్థల ఆధ్వర్యంలో ప్రపంచ మత సమైక్యత వారోత్సవాలలో భాగంగా ఈ నెల 18న ఆదివారం ఉదయం పది గంటలకు డాక్టర్ ఎల్‌బి కాలేజ్ ఆవరణలోని గాంధియన్ సెంటర్ సెమినార్ హాల్‌లో సెమినార్ నిర్వహిస్తున్నట్లు వైజాగ్ ఫిలిం సొసైటీ గౌరవ కార్యదర్శి నరవ ప్రకాశరావు తెలిపారు. సదస్సులో నన్నయ యూనివర్సిటీ పూర్వ విసి ఆచార్య పి.జార్జ్ విక్టర్, ఎయు ఆంత్రోపాలజీ పూర్వ ఆచార్యులు ఆచార్య కె.తిమ్మారెడ్డి పాల్గొంటారన్నారు. ఇతర వివరాలకు 9032477463. నెంబర్‌కు సంప్రదించాలని కోరారు

విద్యతోపాటు ఉద్యోగావకాశం

ఎనిమిది మందికి ఆఫర్ లెటర్లు ఇచ్చిన శంకర్ ఫౌండేషన్

ఉద్యోగాలు పొందిన విద్యార్థులతో ఫౌండేషన్ ప్రతినిధులు

ప్రజాశక్తి- వేపగుంట : నాయుడుతోట శంకర్ ఫౌండేషన్ కాలేజీకి అనుబంధంగా ఉన్న కాలేజీలో మూడేళ్ల ఆప్టోమెట్రీ బిఎస్‌సి కోర్సును విజయవంతంగా పూర్తి చేసిన విద్యార్థులకు అదే సంస్థలో ఇంటర్న్‌షిప్ ఇప్పించి, పర్మినెంట్ ఉద్యోగాల్లో నియమించుకున్నారు. ఈ సందర్భంగా శంకర్ ఫౌండేషన్ జీఎం (అడ్మిన్ అండ్ ఆపరేషన్స్) కె.రాధాకృష్ణన్ మాట్లాడుతూ, సమాజానికి సేవ చేయడానికి ఆసక్తి ఉన్న అభ్యర్థులకు సొంతంగా నిలబడేలా జీవనోపాధికి జాబ్ ఓరియెంటెడ్ కోర్సులను అందించడానికి శంకర్ ఫౌండేషన్ మరింత ప్రాధాన్యతనిస్తోందన్నారు. స్కూల్ ఆఫ్ ఆప్టోమెట్రీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ పి.కృష్ణప్రసాద్ మాట్లాడుతూ పాఠశాలలో అందిస్తున్న ఆప్టోమెట్రీలో డిగ్రీ, డిప్లొమా కోర్సులను వివరిస్తూ, విద్యార్థులు నేర్చుకోవడంపై దృష్టి సారించాలని, ఆసుపత్రిలో సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. డీజీఎం వి.రమేష్ కుమార్ మాట్లాడుతూ, వివిధ ఆసుపత్రుల్లో జాబ్ ఓరియెంటెడ్ ప్రొఫెషనల్ కోర్సుల గురించి మాట్లాడారు. ఈ సందర్భంగా బిఎస్‌సి ఆప్టోమెట్రీ ఏడుగురు యువతులు, ఒక యువకునికి శంకర్ ఫౌండేషన్‌కు సేవలందించేందుకు ఆఫర్ లెటర్లను అందజేశామని మేనేజర్ (హెచ్‌ఆర్) ఎం.శివప్రసాద్ తెలిపారు. సీనియర్ మేనేజర్ (ట్రైనింగ్) కె. వినోద్‌కుమార్, ఎస్.బంగార్రాజు, డిప్యూటీ జనరల్ మేనేజర్ (పీఆర్ అండ్ లైజన్) అధ్యాపకులు అలేఖ్య, మౌనిక, దుర్గ పాల్గొన్నారు.

ముగిసిన జైళ్ల అధికారుల పునశ్చరణ తరగతులు

ముగింపు తరగతుల్లో పాల్గొన్న జైలు అధికారులు

ప్రజాశక్తి - ఆరిలోవ : విశాఖ కేంద్రకారాగారంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జైళ్ల శాఖ ఆధ్వర్యంలో ఆ శాఖకు చెందిన అధికారులకు పునశ్చరణ తరగతులు గురువారం ముగిసాయి. రాష్ట్ర జైళ్ల శాఖ డిజి హరీష్ కుమార్ గుప్తా, ఐజి డాక్టర్ ఇండ్ల శ్రీనివాసరావు పాల్గొని రాబోయే రోజుల్లో జైళ్లలో ఖైదీల రద్దీని ఎలా ఎదుర్కోవాలి అనే అంశాలపై అధికారులకు వివరించారు. దామోదరం సంజీవయ్య నేషనల్ లా యూనివర్సిటీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ నందిని జైలు నిర్వహణకు సంబంధించి చట్టపరమైన తాజా పరిమాణాలపై ప్రత్యేక సెషన్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జైళ్ల ఉపశాఖాధికారులు ఎం.వరప్రసాద్, ఎంఆర్.రవికిరణ్, పర్యవేక్షణాధికారి ఎస్.కిషోర్ కుమార్, అదనపు పర్యవేక్షణాధికారి ఎం.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

రోగులకు మందులు అందజేస్తున్న ఎమ్మెల్యే వెలగపూడి

ప్రజాశక్తి - ఆరిలోవ : గీతం ఆసుపత్రి, ఎన్టీఆర్ సేవా ట్రస్టు సంయుక్త ఆధ్వర్యంలో ఆరిలోవ టిఐసి పాయింట్ వద్ద గురువారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన వచ్చింది. గీతం హాస్పిటల్ వైద్యుల పర్యవేక్షణలో 909 మందికి వివిధ రకాల వైద్య పరీక్షలు ఉచితంగా నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు పాల్గొని రోగులకు మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆపరేషన్ అవసరమైన వారికి రూ.లక్ష వరకు ఉచితంగా చేయిస్తామన్నారు.

కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ ఒమ్మి సన్యాసిరావు, వార్డు ఇన్‌ఛార్జి ఒమ్మి అప్పలరాజు, అధ్యక్షులు గాడి సత్యం, పార్లమెంటు ఆర్గనైజింగ్ సెక్రటరీలు ఒమ్మి పోలారావు, ఏడువాక సన్యాసిరావు, వార్డు ఉపాధ్యక్షులు కొత్తల గోపాల్, 9వ వార్డు ఇన్‌ఛార్జి బుడుమూరు గోవింద, 10వ వార్డు ఇన్‌ఛార్జులు మద్దిల రాజశేఖర్, గాడు అప్పలనాయుడు పాల్గొన్నారు.

బిసిల్లో చేర్చాలని పాదయాత్ర

ప్రజాశక్తి- తగరపువలస: తమను బిసిల్లో చేర్చాలని డిమాండ్ చేస్తూ తెలగ కులస్తులుభీమిలి మండలం తాటితూరు, తగరపువలస ప్రాంతాల్లో గురువారం పాదయాత్ర చేశారు. ఉత్తరాంధ్ర తెలగ కుల ప్రతినిధి పల్లంట్ల వెంకట రామారావు ఆధ్వర్యాన జరిగిన పాదయాత్రలోఉత్తరాంధ్ర తెలగ కులస్తులను బిసి జాబితా లో చేర్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పరిమి భువనేశ్వరి, శ్యామ్ సుందర్, కాసా శేఖర్ దొర పాల్గొన్నారు

తగరపువలసలో తెలగ కులస్తుల పాదయాత్ర

నులిపురుగుల నివారణ మాత్రల పంపిణీ

ప్రజాశక్తి- వేపగుంట : జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా గురువారం జివిఎంసి 52 వ వార్డు అంబేద్కర్ నగర్ అంగన్వాడీ కేంద్రంలో చిన్నారులకు డివార్మింగ్ మాత్రలను గ్రేటర్ విశాఖ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ పంపిణీ చేసారు. అనంతరం అంగన్వాడీలో బాలింత, గర్భిణులకు గుడ్లు పాలుతో కూడిన సంపూర్ణ పోషణ కిట్ అందజేసారు.

17న కృష్ణరాయపురంలో శంఖారావ సభ

ప్రజాశక్తి- పెందుర్తి : ఈనెల 17న వేపగుంట కృష్ణరాయపురం మెయిన్‌రోడ్డును ఆనుకుని బొడ్డేటి ఎస్టేట్‌లో నిర్వహించనున్న టిడిపి జాతీయ ప్రధానకార్యదర్శి లోకేష్ శంఖారావ సభను విజయవంతం చేయాలని మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి పిలుపునిచ్చారు. గురువారం 94వ వార్డు కృష్ణరాయపురంలో టిడిపి కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ, లోకేష్ యువగళం పాదయాత్రకు విశేషస్పందన వచ్చిందని, ఇపుడు శంఖారావ సభలకు ప్రజలు పోటెత్తి వస్తున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో టిడిపి, జనసేన కూటమి విజయమే లక్ష్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు.

నేరాలు ఘోరాలు

ఆన్‌లైన్ బెట్టింగ్‌కు యువకుడు బలి

ప్రజాశక్తి - బుచ్చయ్యపేట : బుచ్చయ్యపేట మండలం ఆర్.శివరాంపురం గ్రామంలో ఆన్లైన్ బెట్టింగ్‌కు ఓ యువకుడు బలయ్యాడు. ఆర్.శివరాంపురం గ్రామానికి చందక కోటేశ్వరరావు (25) ఆన్లైన్ బెట్టింగ్‌లో డబ్బులు పోగొట్టుకున్నాడు. దాంతో పాటు ఇతర బాధలు తట్టుకోలేక కోటేశ్వరరావు సూసైడ్ నోట్ రాసి, గురువారం తెల్లవారు జామున పశువుల పాకలో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. గతంలో కొన్ని అప్పులు చేసి ఆన్లైన్లో బెట్టింగులు చేసి ఇబ్బందులు పడ్డారు. దీంతో గత కొంతకాలంగా మానసికంగా ఇబ్బంది పడుతున్నారు. కుటుంబీకులు ఇచ్చిన సమాచారం బుచ్చయ్యపేట పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చోడవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ప్రయాణికుల సౌకర్యమే ముఖ్యం

బస్‌బేలను ప్రారంభిస్తున్న కెకె.రాజు, వైసిపి నేతలు

ప్రజాశక్తి- సీతమ్మధార : జివిఎంసి 14, 44, 45 వార్డుల పరిధిలోని జాతీయ రహదారిలో అక్కయ్యపాలెం జంక్షన్ నార్త్ అండ్ సౌత్, పోర్టు హాస్పిటల్ జంక్షన్ల వద్ద రూ.1.07 కోట్ల వ్యయంతో నూతనంగా నిర్మించిన నాలుగు బస్ బేలను గురువారం ప్రారంభించారు. జివిఎంసి ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కంపా హనోక్, 14వ వార్డు కార్పొరేటర్ కె.అనిల్‌కుమార్ రాజు ఆధ్వర్యంలో ఉత్తర నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త కె.కె రాజు వీటిని ప్రారంభించారు ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రయాణికుల సౌకర్యం కోసం వీటిని నిర్మించామని, సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎఇఇ రమణమ్మ, ఉమా మహేశ్వరరావు, వైసిపి నేతలు కిరణ్‌రాజు, హరిపట్నాయక్, హబీబ్, కె.సత్యనారాయణ, సీతారాములు, గోపి, కన్నప్పుడు, నాగరాజు, గణపతి, ఆది లక్ష్మీ, పైడి శ్రీను, ప్రసాద్, శ్రీరామ్మూర్తి, లింగేశ్వరరావు, నాయుడు, వెంకటరావు, బషీర్, ముస్తఫా, తులసి పాల్గొన్నారు.

అర్హులకు సంక్షేమ పథకాలు లక్ష్యం

సీతమ్మధార : అర్హులకు సంక్షేమ పథకాలను అందించడమే లక్ష్యంగా వైసిపి బూత్ ఏజెంట్లు, ముఖ్యనాయకులు పనిచేయాలని ఉత్తర నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త కెకె.రాజు పిలుపునిచ్చారు. 25వ వార్డు వెన్నెల కల్యాణమండపంలో స్థానిక కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. అనంతరం పార్టీ శ్రేణులకు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లకు నూతన వస్త్రాలను పంపిణీ చేశారు.కార్యక్రమంలో జెసిఎస్ ఇన్‌ఛార్జి కర్రి మురళీకృష్ణారెడ్డి, డైరెక్టర్స్ నూకరాజు, యస్.సురేష్, బి గోవింద్, మువ్వల సంతోష్, సారిపల్లి సంతోష్, హరికృష్ణ, శ్రవణ్, సమెట్ల వెంకటేష్, అశోక్, బాబు, బొమ్మాళి రవి, సన్నీ, పద్మ, సంధ్య, అప్పన్న, గౌరీనాయుడు, బి.రాజా, కొండలరావు, పాల్గొన్నారు.

నార్త్‌జోన్ ఎసిపిగా సునీల్

ప్రజాశక్తి -మధురవాడ : నార్త్‌జోన్ ఎసిపిగా బి.సునీల్ గురువారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నార్త్‌జోన్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రత్యేకచర్యలు చేపట్టనున్నట్లు వెల్లడించారు. పాత నేరస్తులు, రౌడీషీటర్లపై ప్రత్యేక నిఘా ఉంచడంతోపాటు భూఆక్రమణ వివాదాలపై ప్రత్యేక దృష్టి పెట్టనున్నట్లు తెలిపారు. నగరంలోని నేర విభాగంలో పనిచేసి, నార్త్‌జోన్‌కు బదిలీపై వచ్చారు.

ఎసిపి సునీల్

ఒపిఎస్ పునరుద్ధరించిన వారికే మద్దతు

పోస్టర్లను ఆవిష్కరిస్తున్న యుటిఎఫ్ నేతలు

ప్రజాశక్తి పద్మనాభం : పాత పింఛను విధానాన్ని పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చిన రాజకీయ పార్టీలకే వచ్చే ఎన్నికల్లో ఉద్యోగ, ఉపాధ్యాయుల మద్దతు ఉంటుందని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి రాము ఉప్పాడ స్పష్టం చేశారు. గురువారం యుటిఎఫ్ మండల అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు యన్ నారాయణరావు, కోలా సన్యాసిరావు ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ఏఓట్ ఫర్ ఓల్డ్ పెన్షన్‌సి పోస్టర్లను ఆవిష్కరించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ, వచ్చే ఎన్నికల్లో ఒపిఎస్‌పై స్పష్టమైన హామీ ఇవ్వడంతోపాటు, అధికారంలోకి వచ్చిన వెంటనే దీనిపైనే తొలి సంతకం చేస్తామని భరోసా, నమ్మకం కలిగించిన వారికే ఓటు వేస్తామనే అంశంపై ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికులల్లో విస్తృతం ప్రచారం చేస్తామన్నారు. యుటిఎఫ్ పద్మనాభం మండల శాఖ గౌరవాధ్యక్షులు బోని చిన్నారావు, కోశాధికారి .వివిఎస్. రెడ్డి, కార్యవర్గసభ్యులు విజయ్, శ్రావణి, రమణమ్మ, కాంచన పాల్గొన్నారు.

'అప్సా' ఉపాధ్యక్షునిగా వాసుదేవరావు

ప్రమాణ స్వీకారం చేస్తున్న వాసు

ప్రజాశక్తి -గాజువాక : ఎపి ప్రయివేటు పాఠశాలల సంఘం (అప్సా) రాష్ట్ర ఉపాధ్యక్షునిగా రామకృష్ణ స్కూల్ కరస్పాండెంట్ పొన్నాడ వాసుదేవరావు నియమితులయ్యారు. ఇటీవల తిరుపతిలో నిర్వహించిన అప్సా రాష్ట్ర మహాసభలో సంఘం రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు, వివిధ జిల్లాల నూతన కార్యవర్గ సభ్యులను ఎన్నుకొని ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా వాసుదేవరావు మాట్లాడుతూ అప్సాలో రాష్ట్రవ్యాప్తంగా ఎక్కువమంది సభ్యులను చేర్పించి, ప్రతి సభ్యుని సంక్షేమానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో స్టేట్ కౌన్సిల్‌సభ్యులు సుందరాం, చంద్రశేఖర్, రాము, రవీంద్ర, రాష్ట్ర అధ్యక్షుడు సుబ్రహ్మణ్యరాజు, సెక్రెటరీ సింహాచలం, విశాఖ జిల్లా ప్రధానకార్యదర్శి పి.భాస్కరరావు పాల్గొన్నారు.

జెడ్‌సిగా కనకమహాలక్ష్మి

ప్రజాశక్తి -భీమునిపట్నం : జివిఎంసి ఒకటో జోన్ కమిషనర్‌గా కె. కనక మహాలక్ష్మి గురువారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. రెండో జోన్ జెడ్‌సిగా పనిచేసిన ఆమెను ఇటీవల జివిఎంసి ప్రధాన కార్యాలయం యుసిడి విభాగం ప్రాజెక్ట్ ఆఫీసర్‌గా బదిలీ చేశారు. అక్కడి నుంచి భీమిలి జెడ్‌సిగా నియమించారు. ఈనెల 3న జెడ్‌సిగా బాధ్యతలు స్వీకరించిన జి.శైలజవల్లి 14 రోజుల వ్యవధిలోనే రెండో జోన్‌కు బదిలీపై వెళ్ళారు.

వైవిని కలిసిన చొక్కాకుల

సుబ్బారెడ్డితో వెంకటరావు

ప్రజాశక్తి-సీతమ్మధార : రాజ్యసభ అభ్యర్థిగా నామినేషన్ వేసిన వైసిపి ఉత్తరాంధ్ర రీజనల్ కోఆర్డినేటర్ వైవి. సుబ్బారెడ్డిని విశాఖ ఎమ్మెల్సీ, పిఏసి సభ్యుడు చొక్కాకుల వెంకటరావు గురువారం విజయవాడలో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా రానున్న ఎన్నికల్లో వైసిపి విజయం లక్ష్యంగా పనిచేయాలని సుబ్బారెడ్డి సూచించినట్లు చొక్కాకుల తెలిపారు.

పరిశుభ్రతకు ప్రాధాన్యతనివ్వండి

జివిఎంసి కమిషనర్ సిఎం సాయికాంత్ వర్మ

అధికారులకు సూచనలు చేస్తున్న జివిఎంసి కమిషనర్

ప్రజాశక్తి- వేపగుంట : నగరంలోని బిఆర్‌టిఎస్ రోడ్డులో పరిశుభ్రత పనులు చేపట్టాలని జివిఎంసి ప్రధాన కమిషనర్ సి.ఎం.సాయికాంత్ వర్మ అధికారులను ఆదేశించారు. గురువారం క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా 94, 97 వార్డులలో బిఆర్‌టిఎస్ రోడ్డు, కృష్ణా నగర్, చినముసిడివాడ, శారదపీఠం రోడ్డు తదితర ప్రాంతాలలో పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బిఆర్‌టిఎస్ రోడ్డు మార్జిన్‌లలో, ఖాళీస్థలాలు, బస్‌స్టాప్‌ల వద్ద భవన నిర్మాణ వ్యర్థాలు, చెత్తాచెదారం లేకుండా చూడాలన్నారు., కృష్ణానగర్ ఫుట్‌ఓవర్ బ్రిడ్జి వద్ద పాదచారులకు ఇబ్బందులు లేకుండా ర్యాంప్‌తో పాటు చిన్న మరమ్మతులు చేపట్టాలని జెడ్‌సి హేమావతినిఆదేశించారు. శారదాపీఠం రోడ్డులో సెంటర్ మీడియన్‌లో తక్షణమే మొక్కలు నాటి, వాటి సంరక్షణకు టెండర్ పిలవాలని ఎఇఇ సురేష్‌ను ఆదేశించారు. బిఆర్‌టిఎస్‌లో అతికించిన ప్రకటన పోస్టర్లను తక్షణమే తొలగించాలని ఆదేశించారు. పెద్దచెట్లకు అవసరం లేని టీగార్డులను తొలగించాలన్నారు. పర్యటనలో ఎస్ఇ రమణమూర్తి, ఎసిపి వెంకటేశ్వరరావు, జివిఎంసి అధికారులు పాల్గొన్నారు.

'గీతం'లో సందడిగా అంతర్జాతీయ యువజనోత్సవం

యువజనోత్సవంలో సందడి చేస్తున్న విదేశీ విద్యార్థులు

ప్రజాశక్తి- మధురవాడ : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో అంతర్జాతీయ విద్యార్థుల యువజనోత్సవం 'సంయుక్త-24' గురువారం సందడిగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా గీతం అంతర్జాతీయ విద్యార్థి వ్యవహారాల విభాగం డైరెక్టర్ డాక్టర్ కె.పి.కిషన్ మాట్లాడుతూ, ఈ నెల 16న శుక్రవారం యువజనోత్సవంలో భాగంగా క్రీడా పోటీలతో పాటు సంగీత, నృత్య కార్యక్రమాలు, విదేశీ వంటకాలతో ఫుడ్‌ఫెస్టివల్ నిర్వహించనున్నట్లు తెలిపారు. సంయుక్త యువజనోత్సవం ద్వారా విద్యార్థులు తమ ప్రతిభ పాటవాలను ప్రదర్శించే అవకాశం లభిస్తుందన్నారు. రాష్ట్రంలోని వివిధ విద్యాసంస్థల నుంచి 150 మంది విదేశీ విద్యార్థులు ఉత్సవాల్లో పాల్గొంటారన్నారు. యువజనోత్సవంలో భాగంగా గీతం ప్రాంగణంలో తమ దేశాల జాతీయ జెండాలను ప్రదర్శిస్తూ గీతం విదేశీ విద్యార్థులు భారీ ర్యాలీని నిర్వహించారు.

ఉక్కు ప్రైవేటీకరణ కుట్రలను అడ్డుకోరేం!

కాంగ్రెస్ నేత కొయ్య ప్రసాదరెడ్డి

సమావేశంలో మాట్లాడుతున్న ప్రసాద రెడ్డి.

ప్రజాశక్తి -తగరపువలస :విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం చేస్తున్న యత్నాలను రాష్ట్రంలోని వైసిపి, టిడిపి, జనసేన పార్టీలు ఎందుకు అడ్డుకోలేకపోతున్నాయని ఎపి టెక్నాలజీస్ మాజీ ఛైర్మన్, కాంగ్రెస్ సీనియర్ నేత కొయ్య ప్రసాదరెడ్డి ప్రశ్నించారు. గురువారం తాళ్లవలసలో విలేకర్లతో మాట్లాడుతూ, విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటుపరం కాకుండా కాంగ్రెస్ అడ్డుకుంటుందన్నారు వచ్చే అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి పోటీలో ఉండే స్థానికులనే ఎన్నుకోవాలని కోరారు. డిసిసి అధ్యక్షుడు గంప గోవిందరాజు మాట్లాడుతూ, షర్మిల రాకతో కాంగ్రెస్‌కు పూర్వవైభవం, పునరుత్తేజం వచ్చిందన్నారు. రాహుల్ జోడోయాత్రకు దేశప్రజానీకం బ్రహ్మరథం పడుతున్నారన్నారు జిల్లా ఉపాధ్యక్షులు తలారి సురేష్ మాట్లాడుతూ, రానున్న ఎన్నికల్లో వైసిపి ఓటమి తథ్యమన్నారు. ఇటీవల కాంగ్రెస్‌లో చేరిన ఎవి వర్మరాజు (హసిని వర్మ) మాట్లాడుతూ, న్యాయమైన డిమాండ్లతో ఆందోళన చేస్తున్న ఢిల్లీ రైతులపై దాడులకు పాల్పడడం దారుణమన్నారు.

ఉత్సాహంగా పెన్ స్కూల్ స్పోర్ట్స్ మీట్

పతాకావిష్కరణ చేస్తున్న అతిథులు లింగేశ్వరరావు, పార్థసారథి

ప్రజాశక్తి- సీతమ్మధార : చదువుతోపాటు క్రీడలు, ఇతర అంశాల్లోనూ విద్యార్థులు రాణించి, ఉన్నత శిఖరాలకు ఎదగాలని అంతర్జాతీయ షటిల్ క్రీడాకారుడు బివిఎస్‌కె.లింగేశ్వరరావు ఆకాంక్షించారు. గురువారం పోర్టుజూబ్లీ గ్రౌండ్‌లో పెన్ స్కూల్ వార్షిక స్పోర్ట్‌మీట్ ఒలింపిక్స్‌ను నిర్వహించింది. 6 నుంచి 10వ తరగతి విద్యార్థులు ఏరోబిక్స్, హూప్ డ్రిల్, రేసెస్ వంటి ఈవెంట్లతోపాటు షోస్టాపర్ పిరమిడ్‌లను పిల్లలు నైపుణ్యాలను ప్రదర్శించారు. రిటైర్డ్ ఇంటర్నేషనల్ క్రికెట్ అంపైర్, క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి పార్థసారథి పాల్గొన్నారు. విద్యార్థులు అత్యుత్తమ ప్రదర్శన క్రెడిట్ అంతా పెన్‌స్కూల్ ఛైర్మన్ అనితా పెరీరా, ఉపాధ్యాయులకు దక్కుతుందని ప్రశంసించారు. ఈ సందర్భంగా పెన్ స్కూల్ ఛైర్మన్ అనితా పెరీరా మాట్లాడుతూ, విద్యార్థుల్లో క్రీడానైపుణ్యం, మనోవికాసం పెంపుదలకు ఏటా ఇటువంటి కార్యక్రమాలను చేపడుతున్నట్లు తెలిపారు.కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కెవిపిఎస్ కేలండర్ ఆవిష్కరణ

కేలెండరును ఆవిష్కరిస్తున్న కార్పొరేటర్, కెవిపిఎస్ నేతలు

ప్రజాశక్తి -మాధవధార : కులవివక్ష పోరాట సమితి (కెవిపిఎస్) కేలండర్‌ను 51వ వార్డు వైసిపి కార్యాలయంలో గురువారం స్థానిక కార్పొరేటర్ రెయ్య వెంకటరమణ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మోడీ విధానాలకు వ్యతిరేకంగా కెవిపిఎస్ అనేక పోరాటాలు చేసిందన్నారు. ప్రభుత్వ పరిశ్రమలను ఆదానీ అంబానీ వంటి బడా పెట్టుబడిదారులకు, కార్పొరేట్ శక్తులకు ధారాదత్తం చేయడం దుర్మార్గమన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటుపరం కాకుండా అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో స్టీల్‌ప్లాంట్ సిఐటియు నాయకులు కూన వెంకటరావు, కంచరపాలెం డివైఎఫ్ఐ నాయకులు సనపల శ్రావణ్‌కుమార్, పొన్నాడ అప్పారావు, పప్పల శ్రీదేవి, జనార్థనమ్మ, మున్సిపల్ కార్మికులు దేవి, శ్రీను, కనకమహాలక్ష్మి పాల్గొన్నారు

టెన్త్ విద్యార్థులకు ప్రత్యేక తరగతులు

విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంపిపి

ప్రజాశక్తి -తగరపువలస : టెన్త్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాల సాధనకు చేస్తున్న కషిలో భాగంగా ఎంపిపి డివిఎస్ఎన్.రాజు, అని స్నేహితుడు జగన్మోహన్‌నాయుడు గురువారం భీమిలి మండలం, దాకమర్రి జెడ్‌పి హైస్కూల్ విద్యార్థులకు గణితం, సైన్స్ సబ్జెక్టులలో మెళకువలను నేర్పించారు. సైన్స్ పాఠ్యాంశాన్ని బోధించారు. పరీక్షల నేపథ్యంలో ఆరోగ్యపరమైన జాగ్రత్తలను వివరించారు. విద్యార్థులకు పట్ల ఎంపిపి చూపుతున్న ప్రత్యేక శ్రద్ధపై హెచ్ఎం, ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ చెల్లూరి. పైడప్పుడు, ఎంపిటిసి నగేష్ బాబు పాల్గొన్నారు

వైసిపికి 'కాళ్ల' రాజీనామా

మాట్లాడుతున్న కాళ్ల నగేష్ కుమార్

ప్రజాశక్తి -పద్మనాభం :మండలంలో మద్ది గ్రామానికి చెందిన కాళ్ల నగేష్‌కుమార్, మాజీ ఎంపిపి కాళ్ళ పద్మ, మద్ది మాజీ సర్పంచ్ కాళ్ల సత్యవతి వైసిపికి రాజీనామా చేసినట్లు గురువారం తమ నివాసంలో వెల్లడించారు. 2020 ఆగస్టు 6న అనివార్య కారణాలతో తాను, తన భార్య పద్మ, తల్లి సత్యవతి స్థానిక ఎమ్మెల్యే ముత్తంశెట్టి మంత్రిగా ఉన్న సమయంలో వైసిపిలో చేరినా పార్టీ నుంచి సరైన ప్రోత్సాహం, సహకారం అందలేదని, దీనిపై వైసిపి అధిష్టానానికి తెలియజేసినా స్పందన లేనందున పార్టీని వీడి బయటకు వస్తున్నట్లు వెల్లడించారు. జిల్లా పార్టీ కార్యాలయానికి రాజీనామా లేఖలను పంపుతామన్నారు ఇతర పార్టీల్లో చేరిక విలేకర్ల ప్రశ్నకు స్పందిస్తూ, తన వర్గంలో చర్చించి తగు నిర్ణయం తీసుకుంటానన్నారు.

వంశీ కుటుంబానికి న్యాయం చేయాలి

- ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ, ఎఐవైఎఫ్ ఆధ్వర్యాన రెండో రోజు ధర్నా

- నారాయణ కళాశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్

నారాయణ కాలేజీ ఆవరణలో ఆందోళన చేస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-అనకాపల్లి

అనకాపల్లి నారాయణ జూనియర్ కళాశాలలో చదువుతున్న ముచ్చకర్ల వంశీ ఆత్మహత్యకు కారణమైన కళాశాల యజమాన్యంపై చర్యలు తీసుకోవాలని, విద్యార్థి కుటుంబానికి న్యాయం చేయాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ, ఎఐవైఎఫ్ ఆధ్వర్యాన గురువారం మతుని కుటుంబ సభ్యులు నారాయణ కాలేజ్ వద్ద 2వ రోజు కూడా ధర్నా నిర్వహించారు. సాయంత్రం కొవ్వొత్తులతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎస్.రమణ, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు సిహెస్.శివాజీ మాట్లాడుతూ ఈనెల 12న వంశీని కళాశాలలో అధ్యాపకులు కొట్టడం, దుర్భాషలాగడంతో మనోవేదనకు గురై తన స్వగ్రామం బుచ్చయ్యపేట మండలం చిట్టయ్యపాలెం గ్రామంలో ఆత్మహత్య చేసుకున్నాడని తెలిపారు. కళాశాల ఒత్తిడి వల్లనే విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడని, అందువల్ల ఇది ఆత్మహత్య కాదని నారాయణ కళాశాల చేసిన హత్యేనని పేర్కొన్నారు. ఈ సంఘటన జరిగి రెండు రోజులవుతున్నా ఆర్ఐఓ, జిల్లా కలెక్టర్ నుంచి ఎటువంటి స్పందన లేకపోవడం దుర్మార్గమన్నారు. అధికారులు వంశీ మరణానికి కారణాలపై అధికారులు విచారణ జరపకపోవడం దుర్మార్గమన్నారు. జిల్లా ఉన్నతాధికారులు వెంటనే స్పందించి నారాయణ కళాశాల అనుమతులు రద్దు చేయాలని, సిట్టింగ్ జడ్జి ద్వారా విచారణ చేపట్టాలని, వంశీ కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వంశీ తండ్రి చిరంజీవి, అన్నయ్య శివ, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థి మృతిపై తక్షణమే నివేదిక అందించండి

అధ్యాపకులు కొట్టడం వల్లే అనకాపల్లి నారాయణ కాలేజీ ఇంటర్మీడియట్ మొదటి సంవత్సర విద్యార్థి వంశీ ఇటీవల ఆత్మహత్య చేసుకున్నాడన్న వార్త సోషల్ మీడియాలో హాల్ చల్ చేయడాన్ని ఎపి బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సీరియస్‌గా తీసుకుందని కమిషన్ సభ్యులు గొండు సీతారాం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వ్యవహారంపై అన్ని కోణాల్లో విచారణ జరిపి త్వరితగతిన తక్షణమే నివేదిక అందించాలని జిల్లా ఇంటర్మీడియట్ బోర్డు అధికారులు, పోలీసు అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు పేర్కొన్నారు. ఈ నివేదికలో యాజమాన్యం తప్పిదాలున్నట్టు నిరూపణ అయితే కళాశాల గుర్తింపు రద్దుకు, అధ్యాపకులపై క్రిమినల్ కేసులు నమోదుకు కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు నేతృత్వంలో సిఫారసులు చేయనున్నట్టు సీతారాం వెల్లడించారు.

జెఇఇ మెయిన్స్‌లో సత్తాచాటిన తేజేష్

ప్రజాశక్తి- కె.కోటపాడు

జేఈఈ మెయిన్స్ పరీక్షా ఫలితాల్లో కె.కోటపాడు మండలం కొరువాడ గ్రామానికి చెందిన కొరువాడ తేజేష్ సత్తా చాటాడు. బోర్డు విడుదల చేసిన ఫలితాల్లో 98.29 శాతం మార్కులు సాధించి జేఈఈ క్యాంపస్ ఇంటర్వ్యూకు సెలెక్ట్ అయ్యాడు. తేజేష్ తల్లి లోవమణి గృహిణి కాగా, తండ్రి గోవిందరావు సామాజిక కార్యకర్తగా పని చేస్తున్నారు. తమ కుమారుడు సాధించిన ఈ విజయం పట్ల వారు ఆనందం వ్యక్తం చేశారు. జేఈఈ ఫలితాల్లో మంచి ప్రతిభ కనబర్చి క్యాంపస్ ఇంటర్వ్యూకు సెలెక్ట్ కావడం పట్ల తేజేష్‌కు కొరువాడ గ్రామ పెద్దలు, గ్రామస్తులు అభినందనలు తెలియజేశారు.

సమావేశాలకు హాజరు కాని అధికారులపై చర్యలు

ప్రజాశక్తి-అచ్యుతాపురం : మండల పరిషత్తు సమావేశాలకు హాజరుకాని అధికారులపై చర్యలు తీసుకోనున్నట్లు మండల పరిషత్ అధ్యక్షురాలు కోన సంధ్య అన్నారు. మండల పరిషత్ సర్వసభ్య సమావేశం గురువారం సంధ్య అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా సమావేశానికి అధికారులు గైరాజరుపై ఎంపిపి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రతి మండల సమావేశానికి సంబంధిత అధికారులు హాజరై సభ్యులు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు చెప్పాల్సి ఉందని పేర్కొన్నారు. పూడిమడక ఎంపీటీసీ సభ్యురాలు వాసుపల్లి పద్మ మాట్లాడుతూ ఇంటి స్థలాలు సెంటున్నరు మాత్రమే ఇవ్వాల్సి ఉండగా ఒక్కొక్కరికి పది సెంట్లు చొప్పున ఇవ్వడంపై అధికారులను ప్రశ్నించారు. రైతుల నుండి సేకరించిన ధాన్యానికి ఎప్పుడు డబ్బులు చెల్లిస్తారని మల్లవరం సర్పంచ్ పిన్నమరాజు వాసు వ్యవసాయ అధికారిని అడిగారు. పట్టాదారు పాస్ పుస్తకాలకు సంవత్సరాల తరబడి అధికారులు తిప్పిస్తున్నారని మడుతురు సర్పంచ్ మోటూరు సంజీవి ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో ఎంపీడీవో సురేష్ కుమార్, తహశీల్దారు సరోజినీ, జిల్లా పరిషత్ కో ఆప్షన్ సభ్యులు ఎన్ కుమార్, డిప్యూటీ తహశీల్దారు కుమారస్వామి, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, అధికారులు పాల్గొన్నారు.

ఎంపిపిని కలిసిన రూరల్ ఎస్ఐ

ప్రజాశక్తి-అనకాపల్లి : స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో గురువారం ఎంపిపి గొర్లి సూరిబాబుని అనకాపల్లి రూరల్ ఎస్సై తేజేశ్వరరావు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గ్రామీణ ప్రాంతంలో లా అండ్ సమస్యలతో పాటు పలు అంశాలను చర్చించారు.

మానస మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి ప్రారంభం

ప్రజాశక్తి-అనకాపల్లి : స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ ఎదురుగా మానస మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిని గురువారం అనకాపల్లి పార్లమెంటు సభ్యురాలు డాక్టర్ బివి.సత్యవతి విష్ణుమూర్తి దంపతులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి ఏర్పాటు చేయడం ద్వారా జిల్లా కేంద్రంలో వైద్య సేవలు మరింత విస్తృతం కానున్నాయని తెలిపారు. డాక్టర్ మానస మాట్లాడుతూ తమ ఆసుపత్రిలో మధుమేహం, నరాల బలహీనత, గుండె సమస్యలు, పక్షవాతం, కీళ్ల సమస్యలు, గ్యాస్ట్రిక్ అల్సర్స్, కిడ్నీ, ఐసీయూ, చిన్నపిల్లల వైద్య సేవలు 24 గంటలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. ఆసుపత్రిలో ఆపరేషన్ థియేటర్‌ను వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్ కుమార్, డాక్టర్స్ ఛాంబర్‌ను కార్పొరేటర్లు పీల లక్ష్మి సౌజన్య రాంబాబు, కొణతాల నీలిమ భాస్కర్, ఐసీయూ ఛాంబర్‌ను టిడిపి నాయకులు దాడి రత్నాకర్ ప్రారంభించారు. ఆసుపత్రి యాజమాన్యాన్ని మాజీ ఎమ్మెల్సీ బుద్ధ నాగ జగదీశ్వరరావు, గవర కార్పొరేషన్ చైర్మన్ బొడ్డేడ ప్రసాద్, వైసిపి పట్టణ అధ్యక్షులు జానకి రామరాజు, ఐఎంఎ డాక్టర్లు అభినందించారు. వైద్యులు డాక్టర్ హరిప్రియ, విపిటి మహీధర్ పాల్గొన్నారు.

బాలల హక్కులు ఉల్లంఘన లేకుండా చూడాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : బాలల న్యాయ రక్షణ కల్పించడంతో పాటు, బాలల హక్కుల ఉల్లంఘన లేకుండా చూడాలని జిల్లా స్త్రీ శిశు సంక్షేమ శాఖ అధికారిణి కే అనంతలక్ష్మి పేర్కొన్నారు. స్థానిక జీవీఎంసీ బాలికల ఉన్నత పాఠశాలలో గురువారం కేజీబీవీ ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయులకు బేటీ బచావో బేటి పడావో జిల్లాస్థాయి ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా అనంతలక్ష్మి మాట్లాడుతూ బాల్య వివాహాల నిరోధానికి, బాలల రక్షణకు, రక్షణగృహాలకు పంపడానికి తగు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. బాలల సంక్షేమం జిల్లా ప్రొబేషన్ అధికారి శరత్ మాట్లాడుతూ బాలల హక్కుల ఉల్లంఘన ఎక్కడ జరిగినా తెలియజేయాలన్నారు. తగరంపూడి పిహెచ్సి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పావని మాట్లాడుతూ ఎవరైనా లింగ నిర్ధారణ పరీక్షలు చేసినా, ప్రోత్సహించినా వారిపై చర్యలు ఉంటాయని చెప్పారు. జిల్లా బాలల పరిరక్షణ విభాగం ప్రొటెక్షన్ అధికారి పి లక్ష్మీ మాట్లాడుతూ ఇతర సహాయ సహకారానికి 9966141470 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

పలు కార్యక్రమాల్లో పాల్గొన్న భరత్ కుమార్

ప్రజాశక్తి-అనకాపల్లి : వైసిపి అనకాపల్లి నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్ కుమార్ గురువారం పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. తుమ్మపాల గ్రామంలో రాష్ట్ర ఇన్ ల్యాండ్ వాటర్ వేస్ అథారిటీ బోర్డు చైర్మన్ దంతులూరి దిలీప్ కుమార్ ఆధ్వర్యంలో పలు సంఘాల నాయకులను, వైసిపి కార్యకర్తలను వారి నివాసాలలో మర్యాదపూర్వకంగా కలిశారు. తుమ్మపాల, గవరపేట వీధిలో జరుగుతున్న మరిడిమాంబ అమ్మవారి పండగ సందర్భంగా అమ్మవారిని దర్శించుకున్నారు. బంగార్రాజు కళ్యాణ మండపంలో జరిగిన కర్రి బాబి మనుమడు నామకరణ ఉత్సవాలో పాల్గొన్నారు. కసింకోట మండలం, సుందరపేట గ్రామ మాజీ సర్పంచ్ ప్రకాష్‌ని వారి నివాసంలో కలిశారు. ఏఎస్ పేట గ్రామంలో మందపల్లి చిరంజీవి అమ్మాజీ నూతన గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్నారు.

సిపిఎంకి రూ.50 వేలు విరాళం

ప్రజాశక్తి-అచ్యుతాపురం



సిహెచ్.నర్సింగరావుకు చెక్కు అందజేస్తున్న రాముడు, రమణమ్మ దంపతులు, వధూవరులు మాధురి, భాస్కరరావు

అచ్యుతాపురం మండలం చిప్పాడ గ్రామానికి చెందిన రాజాన రామునాయుడు, రమణమ్మ దంపతులు తమ కుమార్తె మాధురి వివాహం సందర్భంగా సిపిఎం అనకాపల్లి జిల్లా కమిటీకి రూ.50వేలు బూరి విరాళాన్ని అందించారు. రామునాయుడు రమణమ్మ దంపతులు సిపిఎం అభిమానులు. తమ కుమార్తె వివాహం సందర్భంగా పార్టీకి విరాళం అందజేయడానికి వారు ముందుకొచ్చారు. తమ కుమార్తె మాధురికి ఎస్.కోట ధర్మవరం గ్రామానికి చెందిన భాస్కరరావుతో బుధవారం తెల్లవారుజామున వివాహం జరిగింది. రామునాయుడు ఆహ్వానం మేరకు వివాహానికి హాజరైన సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు, సిపిఎం అనకాపల్లి జిల్లా కార్యదర్శి కె.లోకనాథం తదితరులు వధూవరులను ఆశీర్వదించారు. రామునాయుడు రమణమ్మ, వధూవరులు మాధురి, భాస్కరరావుల చేతుల మీదుగా రూ.50 వేలు చెక్కును నర్సింగరావు, లోకనాథంకు అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం అచ్యుతాపురం మండల కన్వీనర్ ఆర్.రాము, విశాఖ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఆర్‌కెఎస్‌వి.కుమార్, బి.జగన్, సీనియర్ నాయకులు ఎన్.రాజేంద్రప్రసాద్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌టిపిసి ప్రభావిత ప్రాంతాల అభివృద్ధికి కృషి

మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌కె.సిన్హా

ప్రజాశక్తి-పరవాడ

పరవాడ ఎన్టీపీసీ సింహాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ చుట్టుపక్కల ప్రాంతాల యువతకు మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించేందుకు వివిధ రంగాలలో శిక్షణ, నైపుణ్యం అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు ప్రాజెక్ట్ హెడ్ ఎస్‌కె.సిన్హా తెలిపారు. గురువారం పరవాడ సబ్ స్టేషన్ కూడలిలో ఉన్న ఏకోనా హోటల్లో నిర్వహించిన తెలుగు మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఒక్కో బ్యాచ్‌లో 30 మంది విద్యార్థులు పోస్ట్ డిప్లమా ప్లాస్టిక్ టెక్నాలజీలో శిక్షణ పొందుతున్నట్లు చెప్పారు. వీరికి స్టయిఫండ్ అందజేయడంతో పాటు పూర్తి రెసిడెన్షియల్ విధానంలో శిక్షణ ఇస్తున్నట్లు పేర్కొన్నారు. శిక్షణ అనంతరం బెంగళూరులోని ప్రముఖ ప్లాస్టిక్ కంపెనీలో ఉపాధి కల్పిస్తున్నట్లు చెప్పారు. సెంట్రల్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డుతో ఆన్లైన్ విధానంలో తమ ప్రాజెక్టు అనుసంధానమైనట్లు తెలిపారు. పర్యావరణ పరిరక్షణకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నట్టు వెల్లడించారు. సింహాద్రి ప్రభావిత ప్రాంతాల్లో సర్పంచులు వినతులు మేరకు సిఎస్ఆర్ నిధులతో పాఠశాల భవనాల నిర్మాణం, మంచినీటి సౌకర్యాలు కల్పన, సోలార్ విద్యుత్ వ్యవస్థ ఏర్పాటు వంటి కార్యక్రమాలు చేస్తున్నట్లు చెప్పారు. మొబైల్ వైద్యాలయాలు నిర్వహణ ద్వారా ఏటా 16 వేల మందికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. లేడీస్ క్లబ్ ద్వారా మహిళలకు బ్యూటీషియన్, టైలరింగ్ వంటి వాటిలో శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సమావేశంలో వివిధ విభాగాలకు చెందిన సింహాద్రి అధికారులు, వివిధ ప్రింట్ మీడియా ఎలక్ట్రానిక్ మీడియా రిపోర్టర్లు పాల్గొన్నారు.

కార్పొరేట్ సంస్థకు కొమ్ముకాస్తున్న డిప్యూటీ సిఎం

ప్రజాశక్తి-అనకాపల్లి : ఉపముఖ్యమంత్రి బూడి ముత్యాలు నాయుడుకు జిల్లా ప్రయోజనాల కంటే కార్పొరేటు సంస్థల ప్రయోజనాల కోసం పని చేస్తున్నారని టిడిపి జిల్లా అధ్యక్షులు బుద్ధ నాగ జగదీశ్వరరావు ఆరోపించారు. స్థానిక పార్లమెంటరీ పార్టీ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మాడుగుల నియోజకవర్గం దేవరాపల్లి మండలం సమీపంలో పెదకోట రేగుపాలెం వద్ద అదాని హైడ్రో ఫ్లవర్ ప్లాంట్ నిర్మాణానికి రైవాడ రిజర్వాయర్ నీరును ఇవ్వడానికి సిద్ధమవుతున్నారని తెలిపారు. రైవాడ నీరు రైతుల ప్రయోజనాలకు లేకుండా కార్పొరేటు సంస్థలకు ధారాదత్తం చేయడం అన్యాయమన్నారు. న్యూ రేనేబుల్ ఏపీ ఎనర్జీ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఏపీ లిమిటెడ్ పేరుతో 1000 మెగావాట్ల పంపు లిఫ్ట్ స్టోరేజ్ హైడ్రో పవర్ ప్రాజెక్ట్, అల్లూరి జిల్లాలోని రైవాడ రిజర్వాయర్‌కు నీళ్లు వచ్చే గడ్డపై మరో 1500 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి ప్రాజెక్టు నిర్మాణానికి అదానితో గ్లోబల్ ఇన్వెస్ట్మెంట్ సదస్సులో ఏపీ ప్రభుత్వం ఎంఓయు కుదుర్చుకున్నారని తెలిపారు. దానికి తగిన విధంగానే ఇప్పుడు రైవాడ నీరు తరలించడానికి చూస్తున్నారన్నారు. ఈ ప్రాజెక్టులు పూర్తయితే ఒక చుక్క నీరు కూడా వెళ్లకుండా సైక్లింగ్ చేస్తూనే ఉంటారని, రైవాడ ఆయకట్టుకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని పేర్కొన్నారు. సమావేశంలో తెలుగు రైతు నాయకులు దాడి ముసలి నాయుడు, గోపివాడ లోవకృష్ణ, మల్ల గణేష్, మల్ల శేషు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న టిడిపి జిల్లా అధ్యక్షులు నాగజగదీష్

రహదారి భద్రతపై అవగాహన సదస్సు

ప్రజాశక్తి- మునగపాక : స్థానిక ప్రణతి విద్యానికేతన్ హైస్కూల్‌లో క్రియేటివ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యాన ఇండియన్ హెడ్ ఇంజరస్ ఫౌండేషన్, హీరో మోటా కంపెనీ వారి సహకారంతో రహదారి భద్రతపై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఎల్‌కెజి నుండి మూడో తరగతి (8 సంవత్సరాల లోపు) పిల్లలు 275 మందికి హెల్మెట్లు స్థానిక ఎస్సై ప్రసాదరావు చేతుల మీదుగా పంపిణీ చేశారు. అనంతరం ఎస్సై మాట్లాడుతూ తల్లిదండ్రులే కాకుండా పిల్లలు కూడా హెల్మెట్లు ధరించి ప్రయాణం చేయాలని, రోడ్డు మీద ప్రయాణించేటప్పుడు తప్పనిసరిగా రోడ్ సేఫ్టీ నియమాలు పాటించాలని కోరారు. కార్యక్రమం ఏర్పాటు చేసిన క్రియేటివ్ స్వచ్ఛంద సంస్థ వారికి, ప్రణతి స్కూల్ ప్రిన్సిపాల్ సతీష్‌కు ప్రత్యేకమైన అభినందనలు తెలియజేశారు. క్రియేటివ్ సంస్థ కార్యదర్శి మల్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ మా సంస్థ తరఫున విశాఖపట్నం అర్బన్, అనకాపల్లి అర్బన్ ఏరియాల్లో 5వేల మంది పిల్లలకు హెల్మెట్లు పంపిణీ, 15000 మంది పిల్లలకు అవగాహన సదస్సులు నిర్వహించాలని నిర్ణయించినట్లు చెప్పారు. కార్యక్రమంలో డాక్టర్ రవి, స్కూల్ ప్రిన్సిపాల్ సతీష్, సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి- సబ్బవరం : తాసుపల్లి ఫౌండేషన్ చైర్మన్ శంకర్ నాయుడు జన్మదినం పురస్కరించుకొని రోటరీ బ్లడ్ బ్యాంక్, లైఫ్ షేర్ బ్లడ్ బ్లాంక్‌లు సౌజన్యంతో మండలంలోని జోడుగుళ్ల బంగారుతల్లి సేవా సమితి ఆధ్వర్యంలో స్థానిక దుర్గమాంబ ఆలయం ప్రాంగణంలో గురువారం నిర్వహించిన రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ రక్తదాన శిబిరాన్ని ప్రారంభించిన శంకర్ నాయుడు మాట్లాడుతూ రక్తదానంతో ఆపదలో ఉన్న ప్రాణాన్ని కపాడవచ్చని చెప్పారు. ఈ రక్తదాన శిబిరంలో 140 మంది యువతీ, యువకులు పాల్గొనగా, 116 మంది నుండి 116 యూనిట్లు రక్తాన్ని సేకరించారు. అనంతరం శ్రీబంగారు తల్లి సేవా సమితి సభ్యులు కేక్ కట్ చేసి శంకర్ నాయుడు జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. రక్తదానం చేసిన యువకులను మెమోంటోలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో బంగారు తల్లి సేవాసమితి అధ్యక్షుడు సింగంపల్లి వెంకటరావు, డాక్టర్లు పాల్గొన్నారు.

రెండో రోజుకు టిడిపి పాదయాత్ర

ప్రజాశక్తి-దేవరాపల్లి : బాబు షూరిటీ- భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా టిడిపి మాడుగుల నియోజకవర్గ ఇన్చార్జి పివిజి.కుమార్, మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు చేపట్టిన పాదయాత్ర గురువారం రెండో రోజుకు చేరింది. మండలంలోని తెనుగుపూడి భీమలింగేశ్వర స్వామి ఆలయం వద్ద ప్రారంభమైన ఈ పాదయాత్ర మారేపల్లి, తారువ, మామిడిపల్లి, వేచలం, ములకలపల్లి గ్రామాల్లో సాగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం, జనసేన కూటమి అభ్యర్థిని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు చిటిమిరెడ్డి సూర్యనారాయణ, పార్టీ సీనియర్ నాయకులు పోతల పాత్రునాయుడు, పోతల చిన్నం నాయుడు, బండారు రామారావు, చల్లా నానాజీ, కిల్లి గోవింద, దొగ్గ రమేష్, అంజి, చింతా సాంబమూర్తి, రాజబాబు, పాల్గొన్నారు.

శంఖారావం సభను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ఈనెల 19న హాజరవుతున్న శంఖారావం సభను విజయవంతం చేయాలని టిడిపి నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం స్థానిక జెఎంజె పాఠశాల సమీపంలో సభా స్థలాన్ని మాజీ శాసనసభ్యులు పీలా గోవింద సత్యనారాయణ, టిడిపి జిల్లా బుద్ధ నాగ జగదీష్, జిల్లా మాజీ అధ్యక్షులు దాడి రత్నాకర్, రాష్ట్ర బీసీ సాధికార కన్వీనర్ మళ్ళ సురేంద్ర తదితరులు పరిశీలించారు.

సబ్బవరం : ఈనెల 17న శనివారం వేపగుంట దరి బొడ్డపాటి వారి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో జరగనున్న నారా లోకేష్ శంఖారావం సభను విజయవంతం చేయాలని టిడిపి మండల అధ్యక్షుడు మిడతాడ మహాలక్ష్మి నాయుడు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సభకు బూత్ కన్వీనర్లు, సాధికార మిత్రలు, ఏరియా ఇన్చార్జిలు, క్లస్టర్ ఇన్చార్జులు హాజరు కావాలన్నారు.

టిడిపి విస్తృత స్థాయి సమావేశం

ప్రజాశక్తి-అనకాపల్లి : స్థానిక గవరపాలెం టిడిపి కార్యాలయంలో గురువారం మాజీ శాసనసభ్యులు పీలా గోవింద సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన పట్టణ తెలుగుదేశం పార్టీ విస్తృత స్థాయి సమావేశం జరిగింది. టీడీపీ సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు చేరవేయడంలో బూత్, యూనిట్, క్లస్టర్ ఇంఛార్జిలు ముఖ్య భూమిక పోషించాలని నాయకులు పిలుపునిచ్చారు. సమావేశంలో టిడిపి జిల్లా అధ్యక్షులు బుద్ధ నాగ జగదీశ్వరరావు, మాజీ అధ్యక్షులు దాడి రత్నాకర్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు.

ప్రణాళికాయుతంగా ఎన్నికల ఏర్పాట్లు

జిల్లా కలెక్టర్ రవి పట్టన్ శెట్టి

ప్రజాశక్తి -అనకాపల్లి

రానున్న పార్లమెంటు, అసెంబ్లీ ఎన్నికల సజావుగా జరిపించేందుకు అధికారులందరూ ప్రణాళికాయుక్తంగా పనిచేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రవి పట్టన్ శెట్టి ఆదేశించారు. గురువారం తన చాంబర్లో జిల్లా పోలీసు సూపరింటెండెంట్ కె.వి మురళీకృష్ణతో కలిసి జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అప్పగించిన బాధ్యతలను నిబద్ధతతో ఎన్నికల కమిషన్ నిబంధనలను అనుసరించి నిర్వహించాలని, పై అధికారుల నుండి వచ్చే ఆదేశాలననుసరించి తు.చ. తప్పకుండా పాటించాలని కోరారు. ముందుగా జిల్లాలోని అధికారులను వారు పనిచేసే శాఖ నిబద్ధతలను బట్టి టీంలుగా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. వీరందరికీ 16వ తేదీన శిక్షణా తరగతులు నిర్వహిస్తామన్నారు. ఎన్నికలకు అవసరమైన ఏర్పాట్లు, కమాండ్ కంట్రోల్ సెంటర్, వీడియోవీవింగ్, ఫ్లయింగ్ స్క్వాడ్స్, అకౌంటెంటింగ్, మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్, వీడియో సర్వేలన్స్, ఎక్స్పెండిచర్ అబ్జర్వర్స్, మొదలైన విభాగాలను ఏర్పాటు చేయాలన్నారు. ఎస్‌పి మురళీకృష్ణ మాట్లాడుతూ ఎన్నికలకు అవసరమైన బందోబస్తును ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ఎటువంటి అనుమానాలకు ఆస్కారమీయకుండా పక్కాగా విధులు నిర్వహిచాలని కోరారు. ఈ సమావేశంలో అడిషనల్ ఎస్పీ బి.విజయభాస్కర్, ముఖ్య ప్రణాళిక అధికారి జి.రామారావు, లీడ్ బ్యాంకు మేనేజర్ సత్యనారాయణ, మత్స్యశాఖ డిడి ప్రసాద్, జిల్లా సహకార అధికారి కిరణ్ కుమారి, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ రామ్మూర్తి, డిటి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళి పై అవగాహన

అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎస్‌పి మురళీకృష్ణ

రానున్న సార్వత్రిక ఎన్నిక నేపథ్యంలో అనకాపల్లి జిల్లాలో 158 సెక్టర్లుగా విభజించి పోలీస్ అధికారులకు ఎన్నికలపై ఎస్పీ మురళీకృష్ణ ఆధ్వర్యంలో గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సెక్టర్ అధికారుల విధులు, బాధ్యతలు తెలియజేసి పరీక్ష నిర్వహించారు. అనకాపల్లి జిల్లాలో హెడ్ కానిస్టేబుల్, ఏఎస్ఐ, ఎస్సైలు పరీక్షలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ బి.విజయభాస్కర్, ఇన్స్పెక్టర్లు చంద్రశేఖర్, అప్పలనాయుడు, కుమారస్వామి, ఎస్సైలు నాగ కార్తీక్, సావిత్రి, దివ్య, జిల్లాలోని సెక్టర్ ఇంచార్జ్ అధికారులు పాల్గొన్నారు.

ఎన్ఎఒబి నిర్వాసితులకు న్యాయం చేయాలి

మాట్లాడుతున్న ఐద్వా నాయకులు వరలక్ష్మి

ప్రజాశక్తి-రాంబిల్లి

రాంబిల్లి మండలం, పెదకలవలపల్లి గ్రామంలో ఎన్ఎఒబి నిర్వాసితుల సమస్యలను పరిష్కరించాలని అఖిలభారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) జిల్లా నాయకులు డి.డి.వరలక్ష్మి, రావి లక్ష్మి డిమాండ్ చేశారు. పెదకలవలపల్లి గ్రామంలో నేవల్ బేస్ కోసం చేపట్టిన ప్రహరీ నిర్మాణం ఆపాలని నిర్వాసితులు చేపట్టిన దీక్షలు 113వ రోజుకు చేరాయి. ఈ దీక్షా శిబిరాన్ని ఐద్వా నాయకులు గురువారం సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెదకలవలపల్లిలో జిరాయితీ, డి-పట్టా భూముల నుండి ప్రహరీ నిర్మాణం చేస్తున్నారని, దీని వలన గ్రామానికి అన్ని విధాల నష్టం జరుగుతుందని తెలిపారు. గత కొన్నేళ్లుగా ఉపాధి హామీ పనులు ఈ కొండల మీదే చేసుకుని జీవిస్తున్నారని, ప్రహరీ వల్ల కొండల మధ్య నుంచి దారి పోతుందన్నారు. అలాగే శారదా నది ఉప్పొంగినప్పుడు ఈ కొండల మీదే ఆధారపడి పాడిపశువులను పెంచుకొని బతుకుతున్నారని, వారి కల్లాలు కూడా అక్కడే ఉన్నాయని చెప్పారు. మా గ్రామంలో ఇళ్లను కలుపుకొని ప్రహరీ నిర్మిస్తే వారు ఎలా బతుకుతారని ప్రశ్నించారు. నిర్వాసితుల సమస్యలు జిల్లాలో అందరి అధికారులకు తెలిసినా ఏ ఒక్క అధికారీ పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. ఈ సమస్యపై జిల్లా కలెక్టర్ వెంటనే స్పందించి న్యాయం చేయాలని, లేకుంటే జిల్లా కలెక్టర్ ఆఫీస్ వద్ద పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కన్వీనర్ జి.దేవుడు నాయుడు, పెద్ద కలవలపల్లి మాజీ ఎంపీటీసీ రావి దేవుళ్ళు, నిర్వాసితులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

సుప్రీం తీర్పుపై సిపిఎం హర్షం

ప్రజాశక్తి-అనకాపల్లి

ఎన్నికల బాండ్లు రాజ్యాంగ విరుద్ధమన్న సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు పట్ల సిపిఎం అనకాపల్లి జిల్లా కార్యదర్శి కె.లోకనాథం గురువారం గురువారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ఈ తీర్పుని సిపిఎం స్వాగతించిందని పేర్కొన్నారు. ఎన్నికల్లో దొంగడబ్బు, నల్లధనం విచ్చలవిడిగా ప్రవహిస్తుందని, అధికార పార్టీలకు, పెట్టుబడిదారులు వారి ప్రయోజనాలు ప్రోత్సాహించే అభ్యర్థుల కోసం ఈ డబ్బును వెదజల్లి ఓట్లు కొనుగోలు చేసి ప్రజా తీర్పును తలకిందులు చేస్తున్నారని తెలిపారు. ఇటువంటి పరిస్థితుల్లో ఈ తీర్పు చాలా ప్రత్యేకమైందని, కీలకమైనదని లోకనాథం పేర్కొన్నారు. ఎన్నికల ఖర్చులో పారదర్శకత ఉండాలని సిపిఎం కోరుతుందన్నారు. సుప్రీంకోర్టు తీర్పునకు కొన్ని గంటల ముందు అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ (ఎడిఆర్)... 2022-23 ఆర్థిక సంవత్సరంలో రాజకీయ పార్టీలకు కార్పొరేట్ సంస్థల విరాళాల్లో అధిక శాతం బిజెపికే దక్కాయని నివేదిక విడుదల చేసిందని తెలిపారు. ఆ నివేదికలో కార్పొరేట్ విరాళాలలో సుమారు 90 శాతం బిజెపి ఖాతాలోనే చేరినట్లు, 2022-23లో మొత్తం రూ.850.438 కోట్ల విరాళాలలో, ఒక్క బిజెపికే రూ.719.858 కోట్లు వెళ్లినట్లు తెలియజేసిందని పేర్కొన్నారు. అదే లెక్కలు చెప్పనవసరం లేని ఎన్నికల బాండ్లు రూపంలో ఎన్ని లక్షల కోట్లు బిజెపి ఖాతాలోకి వెళ్ళి వుంటాయో అర్థం చేసుకోవాలన్నారు. ఎన్నికల బాండ్లను పూర్తిగా నిషేధించాలని, ఏ కంపెనీ అయినా, ఏ వ్యక్తి అయినా ఎవరికి ఎంత డబ్బు ఇస్తున్నారో, ఆ పార్టీ ఎంత ఖర్చు పెడుతుందో లెక్క ఉంటేనే నల్లధనం ప్రవాహాన్ని అడ్డుకోగలమని తెలిపారు. ఎన్నికలలో దొంగడబ్బును అరికట్టగలిగితే ఎన్నికల వ్యవస్థను తీసుకురావాలని కోరారు.

జర్నలిస్టుల క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

ప్రజాశక్తి-పరవాడ : పరవాడ జర్నలిస్ట్ స్పోర్ట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాంకీ ఫౌండేషన్ సౌజన్యంతో విశాఖ ఫార్మాసిటీ క్రీడామైదానంలో రెండు రోజుల పాటు నిర్వహిస్తున్న రాంకీ ఫౌండేషన్ జర్నలిస్టుల క్రికెట్ టోర్నమెంట్‌ను గురువారం విశాఖ ఫార్మాసిటీ ఎమ్‌డి డాక్టర్ పిపి లాల్‌కృష్ణ ప్రారంభించారు. ముందుగా పోటీల్లో పాల్గొనే క్రీడాకారులను లాల్ కృష్ణ పరిచయం చేసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధులుగా ఉంటూ నిత్యం సమస్యలపై పోరాటం చేసే జర్నలిస్టులు తమ ఆరోగ్య పరిరక్షణకు ఏదో ఒక క్రీడలను ఆడాలని సూచించారు. జర్నలిస్టుల సంక్షేమానికి రాంకీ ఫౌండేషన్ కట్టుబడి ఉందన్నారు. రాంకీ ఫౌండేషన్ డిప్యూటీ హెడ్ డాక్టర్ శ్రీకాంత్ మాట్లాడుతూ జర్నలిస్టులు క్రీడా స్ఫూర్తితో క్రికెట్ ఆడాలని సూచించారు. మొదటి రోజు జరిగిన క్రీడా పోటీల్లో జిజెఎస్ గాజువాక ఎ టీము, విశాఖ వెబ్ టైగర్స్, విశాఖ వెబ్ వారియర్స్ విజయం సాధించాయి. గాజువాక టీముకు చెందిన నరేష్, విశాఖ వెబ్ టైగర్స్‌కు చెందిన ప్రసాద్, విశాఖ వెబ్ వారియర్స్‌కి చెందిన రాజేష్ మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డులు దక్కించుకున్నారు. వీరికి విశాఖ ఫార్మాసిటీ డీజీఎం గిరిధర్ భక్షి, రాంకీ ఫౌండేషన్ డిప్యూటీ హెడ్ డాక్టర్ శ్రీకాంత్ మెమెంటోలు అందజేశారు. ఈ కార్యక్రమంలో విశాఖ ఫార్మాసిటీ లైజనింగ్ ఏజీఎం రాఘవరెడ్డి, రాంకీ ఫౌండేషన్ ప్రతినిధులు రాజేశ్వరి, శ్రీనివాసరెడ్డి, ఉమ్మడి విశాఖ జిల్లాలకు చెందిన క్రీడాకారులు, పరవాడ జర్నలిస్ట్ స్పోర్ట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఘనంగా బంగారమ్మ, కుంచాలమ్మ తీర్థం

ప్రజాశక్తి-సబ్బవరం : మండలంలోని సబ్బవరం మేజర్ పంచాయతీ శివారు గొర్లివానిపాలెం గ్రామంలో బంగారమ్మతల్లి, కుంచాలమ్మ తల్లి తీర్థ మహోత్సవం ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. భక్తులు అత్యధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. సబ్బవరం సీఐ పిన్నింటి రమణ, గ్రామ సర్పంచ్ దెడ్డం ప్రసాదరావు, ఎంపీటీసీ గొర్లి కృష్ణ చైతన్య, గండి దేముడు తదితరులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. తీర్థాన్ని పురస్కరించుకొని ఉత్సవ కమిటీ, గ్రామ ప్రజలు ఆర్థిక సహాయంతో నిర్వహించిన భారీ అన్న సమారాధన కార్యక్రమాన్ని సిఐ పిన్నింటి రమణ ప్రారంభించారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బాదిరెడ్డి లక్ష్మణ, కోటాన వెంకటరమణ, గొర్లి త్రిమూర్తులు, గొర్లి కృష్ణ, గొర్లి ప్రసాద్, ఉత్సవ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

గుల్లిపల్లిలో మరిడిమాంబ అమ్మవారి తీర్థం

కె.కోటపాడు : మండలంలోని గుల్లిపల్లి గ్రామంలో మరిడిమాంబ తల్లి తీర్థం గురువారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుండి భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో తప్పిడుగుల్లు, మహిళా కోలాటం ప్రదర్శనలు భక్తులను ఎంతో ఆకట్టుకున్నాయి. దేవాలయం వద్ద బండారు తాతయ్యదొర ప్రసాదాలను పంపిణీ చేశారు. గ్రామ సర్పంచ్ బండారు దేముళ్ళు, ఎంపిటిసి సభ్యుడు కసిరెడ్డి దేముడు బాబు పాల్గొన్నారు.

దుర్గాదేవి అమ్మవారి పండగ

అనకాపల్లి : స్థానిక 82వ వార్డు విజయరామరాజుపేటలోలో శ్రీదుర్గాదేవి అమ్మవారి పండగ మహోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మరిడిమాంబ దేవాలయంలో నూకంబిక దేవస్థానం ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ కొణతాల మురళీకృష్ణ, ఆలయ డైరెక్టర్ ఆడారి ఉమ శ్రీనివాస్‌రావులను విజయరామరాజుపేట గ్రామ కమిటీ పెద్దలు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో చైర్మన్ ఆళ్ల శివరామ సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి పలక రాము, వైస్ చైర్మన్ బొబ్బిలి అప్పారావు, పాల్గొన్నారు.

సొంత నిధులతో వ్యవసాయ బోర్లు ఏర్పాటు

ప్రజాశక్తి-సబ్బవరం : మండలంలోని గాలి భీమవరం గ్రామంలో జనసేన సీనియర్ నాయకుడు బలిరెడ్డి అప్పారావు తన సొంత నిధులతో రైతులకు పంట పొలాలలో రెండు వ్యవసాయ బోర్లు ఏర్పాటు చేశారు. గ్రామంలోని పల్లివారి పంట పొలాలకు, పడాల వారి పంట పొలాలకు రెండు బోర్లు తవ్వకాలకు గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా పల్లి వారి, పడాల వారి కుటుంబాలు మాట్లాడుతూ బోర్లు ఏర్పాటుతో తమ వ్యవసాయ భూములకు నీటి కొరత లేకుండా ఉంటుందని హర్షం వ్యక్తం చేశారు. జనసేన నేత బలిరెడ్డి అప్పారావుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పల్లి రామారావు, పల్లి పెద్ద తాత, పల్లి చిన్న తాత, పల్లి అచ్యుత్, రాపర్తి రాము, పడాల రామయ్య, పడాల అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

చలో విజయవాడను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-దేవరాపల్లి : పాత పెన్షన్ సాధనకై చలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఏపీసీపీ ఎస్ఈఏ ఆర్థిక కార్యదర్శి గేదెల సింహాద్రప్పడు గురువారం ఒక ప్రకటనలో కోరారు. ఈనెల 18 ఉద్యోగ ఉపాధ్యాయ కార్మికులు చలో విజయవాడకు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

సమస్యలపై దళితుల వినూత్న నిరసన

ప్రజాశక్తి -కొత్తకోట: రావికమతం మండలం మేజర్ పంచాయతీ కొత్తకోట ఎస్సి కాలనీలో మురుగు నీటి కాలువలు, సామాజిక భవనం నిర్మాణం తక్షణమే చేపట్టాలని కోరుతూ గురువారం అంబేద్కర్ సేవా సంఘం సభ్యుల ఆధ్వర్యంలో మోకాళ్ళ పై నిరసన చేశారు. ఈ సందర్భంగా కాలనీ ప్రెసిడెంట్ మల్లేటి రాజు మాట్లాడుతూ, గత ఏడాదిన్నర కిందట నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ సచివా లయానికి మంజూరు చేస్తున్న రూ. 20 లక్షల నిధుల నుంచి కాలువలు, సామాజిక భవనం నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారన్నారు. ఆ హామీ ఇంత వరకు అమలు కాలేదన్నారు.కాలనీలో గత 35 ఏళ్ళ కిందట నిర్మించిన సామాజిక భవనం కూలేందుకు సిద్ధంగా ఉందన్నారు. మురుగు నీటి కాలువలలో చెత్తా చెదారం పేరుకు పోవడంతో వర్షా కాలంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. కాలనీ వాసులు సంఘ సమావేశాల నిర్వహణకు ఎలాంటి సౌకర్యం లేక నానా అవస్థలు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ సంఘం యూత్ సభ్యులు నెల్లూరు ప్రసాద్, పూతి అరుణ్, అడ్డురు నేతాజీ , తదితరులు పాల్గొన్నారు.

మోకాళ్లపై నిలబడి నినాదాలు చేస్తున్న అంబేద్కర్ సేవా సంఘం సభ్యులు

వేగంగా ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్

ప్రజాశక్తి -రావికమతం:జగనన్న ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్ ప్రక్రియ వెంటనే పూర్తి చేయాలని ఎంపిడిఓ భానుజీరావు గురువారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మండల పరిషత్ కార్యాలయంలో తహసీల్దార్ రమణారావుతో సమావేశం ఏర్పాటు చేశారు. మండలంలో ఇప్పటివరకు 606 పట్టాలు ఇవ్వగా వీటిలో 490 మాత్రమే రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తయిందని తెలిపారు. మిగిలిన పట్టాల వివరాలు సేకరించి రిజిస్ట్రేషన్ ప్రక్రియ రెండు రోజుల్లో పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది, సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంపిడిఓ

డిఎస్‌పిగా వెంకటరామయ్య బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్:నర్సీపట్నం డిఎస్పీగా వెంకట రామయ్య గురువారం బాధ్యతలు చేపట్టారు. ఆయన కర్నూలు జిల్లా ఆళ్లగడ్డ ప్రాంతం నుంచి బదిలీపై నర్సీపట్నం వచ్చారు. ఈ సందర్భంగా పోలీస్ అధికారులు ఆయనకు స్వాగతం పలికారు. ఇంతవరకు నర్సీపట్నంలో ఏఎస్పీగా పని చేసిన అధిరాజ్ సింగ్ రాణా పదోన్నతిపై విశాఖపట్నం బదిలీ అయ్యారు. బాధ్యతలు చేపట్టిన వెంకటరామయ్య విలేకర్లతో మాట్లాడుతూ, శాంతిభద్రతల పరిరక్షణకు సిబ్బంది సమన్వయంతో పని చేస్తానని పేర్కొన్నారు.

చేపడుతున్న పనులు

తాగునీటి బోరు మరమ్మతు పనులు

ప్రజాశక్తి -రావికమతం: మండలంలోని కవగుంట గ్రామంలో మరమ్మతుకు గురైన చేతిబోరును సర్పంచ్ దాసరి సూర్యకుమారి మరమ్మతులు చేయించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, రానున్న ఎండాకాలం దృష్ట్యా గ్రామంలో రక్షిత మంచినీటి పథకం తో పాటు చేతి బోర్ల మరమ్మతులు కాకుండా మందస్తుగా చర్యలు చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో వార్డ్ మెంబర్లు చంద్రన్న, రామనాయుడు, బర్నికన మాలక్ష్మమ్మ, రాము, పి వరహాలు తదితరులు పాల్గొన్నారు.

ఆలయ పునర్నిర్మాణ పనులు ప్రారంభం

ప్రజాశక్తి-గొలుగొండ: మండలంలోని సిహెచ్. నాగాపురం రామాలయ పునర్నిర్మాణ పనులను గురువారం ప్రారంభించారు. ఇక్కడి పాత ఆలయం ఉన్న చోటే రూ.20 లక్షలకు పైబడి అంచనా ఖర్చుతో పునర్నిర్మాణానికి గ్రామస్తులంతా పూనుకున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ యలమంచిలి రఘురామచంద్రరావు మాట్లాడుతూ, తిరుమల తిరుపతి దేవస్థానం రూ.10 లక్షల ఆర్థిక సాయాన్ని అందించారని ఆనందం వ్యక్తం చేశారు.

ఎన్నికల హామీ మేరకు డ్వాక్రా రుణాల మాఫీ

ప్రజాశక్తి- కోటవురట్ల:రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల హామీల్లో భాగంగా ప్రకటించిన డ్వాక్రా రుణ మాఫీ పథకంలో ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. ఈ మేరకు గురువారం మండల కేంద్రంలో మండల పరిషత్ వద్ద వైసిపి మండల పార్టీ అధ్యక్షుడు కిల్లాడ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో మహిళలు హాజరయ్యారు. ఈ సందర్భంగా వైసిపి పాయకరావుపేట ఇంచార్జి కంబాల జోగులు మాట్లాడుతూ, రాష్ట్ర ముఖ్యమంత్రి ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాన్ని తప్పకుండా మడమ తిప్పకుండా నెరవేర్చినట్లు తెలిపారు. మండల వ్యాప్తంగా 39 కోట్ల 20 లక్షలు నిధులను నాలుగు విడతల్లో జమ చేసినట్లు ఆయన చెప్పారు. మాజీ ఎమ్మెల్సీ డివి సూర్యనారాయణరాజు మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేయడంలో దేశంలోనే ముందంజలో ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి సభ్యురాలు ఉమాదేవి, ఎంపీపీ అప్పలనాయుడు, ఎంపీడీఓ కాశీ విశ్వనాథరావు, దత్తుడురాజు, స్థానిక సర్పంచ్ అనిల్ కుమార్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న వైసిపి నియోజకవర్గ ఇన్‌చార్జి జోగులు

కాగా ఈ సమావేశానికి హాజరైన మహిళలకు కొన్ని గ్రామాల డ్వాక్రా సంఘ నాయకులు సరైన సమాచారం అందించలేదు. మధ్యాహ్నం మూడు గంటలకు ప్రారంభమైన సభకు రావలసిన మహిళలు ఉదయం 11 గంటలకే సభా ప్రాంగణంలోకి రావడంతో అసహనం వ్యక్తం చేశారు. సభ ప్రారంభం కాకముందే వెనుదిరిగారు.

17న సర్టిఫికెట్ల పరిశీలన

ప్రజాశక్తి-పాడేరు:గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలోని ఆశ్రమ పాఠశాలలో జిపిఎస్ పాఠశాలలో విధులు నిర్వర్తిస్తున్న ఎస్జీటీలు, తత్సమాన ఉపాధ్యాయులకు స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతులు కల్పించుటకు అర్హులైన ఉపాధ్యాయులకు ఈ నెల 17న సర్టిఫికెట్ల పరిశీలన నిర్వహిస్తున్నట్లు జిల్లా గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ ఐ.కొండలరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఘనంగా సాయిబాబా మందిరం వార్షికోత్సవం

ప్రజాశక్తి -ఎస్.రాయవరం: మండల కేంద్రంలో శిరిడి సాయిబాబా మందిరం 27వ వార్షికోత్సవ ఘనంగా నిర్వహించినట్లు ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త నేమాని గోపాల కృష్ణమూర్తి తెలిపారు. గురువారం నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ, సామూహిక అభిషేకాలు, పూజలు నిర్వహించి భారీ అన్న సమారాధన నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు బొలిశెట్టి శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులు నేమాని సూర్యనారాయణ పాల్గొన్నారు.

లింగాపురం సెంటర్‌లో మరమ్మతుకు నోచని కల్వర్టు

ప్రమాదకరంగా కల్వర్టులు

-బోల్తాపడుతున్న వాహనాలు

-పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి-కోటవురట్ల:మండలంలోని కొడవటిపూడి వెంకటాపురం రోడ్డు మధ్యలో కూలిన కల్వర్టులు ఉండటంతో వాహనదారులు అవస్థలు పడుతున్నారు. లింగాపురం సెంటర్, వెంకటాపురం ప్రధాన కూడలి వద్ద ఏళ్ళ తరబడి రోడ్డు మధ్యలో ప్రధాన కూడళ్ళ వద్ద కల్వర్టులు కూలి ప్రమాదకరంగా దర్శనమిస్తున్నాయి. అధికారులు పట్టించుకోక పోవడంతో ఏ క్షణాన ఏ ప్రమాదం సంభవిస్తుందోనని ఆందోళన చెందుతున్నారు. అలాగే దారి పొడవునా గోతుల భయంతో ప్రయాణికులు ప్రయాణాలు చేసేందుకు హడలి పోతున్నారు. లింగాపురం కూడలి వద్ద ప్రమాదాలు సంభవించిన సందర్భాలు కూడా అనేకం ఉన్నాయి. నిత్యం రద్దీగా ఉండే రహదారి కావడంతో ప్రయాణికులు, విద్యార్థులు ప్రధానంగా వాణిజ్య కేంద్రమైన తుని వెళ్లేందుకు దగ్గర దారి కావడంతో ఈ రోడ్డులో ప్రయాణించేందుకు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కనీసం కూలిన కల్వర్టుల వద్ద ప్రమాద సూచికలు కూడా ఏర్పాటు చేయకపోవడం విశేషం. సంబంధిత శాఖ అధికారులు, స్థానిక నాయకులు స్పందించి మరమ్మతు చేపట్టాలని కోరుతున్నారు.

లింగాపురం సెంటర్ వద్ద బోల్తా పడిన లారీ

తక్షణమే నిర్వాసితులకు పరిహారం చెల్లించాలి

ప్రజాశక్తి-నక్కపల్లి:నిర్వాసితుల సమస్యలు పరిష్కారం చూపకుండా శంఖుస్థాపన చేయడం ఎంతవరకు సమంజసమని నాయకులు, నిర్వాసితులు ప్రశ్నించారు. మండలంలోని రాజయ్యపేటలో గురువారం నిర్వాసితుల సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో నాయకులు మాట్లాడారు. మండలంలోని వైజాగ్ చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటుకు సేకరించిన భూములలో స్టార్టప్ ఏరియాకు బుధవారం అనకాపల్లి కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్, అధికారులు చేతుల మీదుగా శంఖుస్థాపన చేయడం ఎంత వరకు న్యాయ మని ప్రశ్నించారు. భూములు కోల్పోయిన రైతులకు, కూలీలకు, దళితులకు, మత్స్యకారులకు పూర్తి స్థాయిలో పరిహారం, ప్యాకేజీ చెల్లించకుండానే అధికారులు శంఖుస్థాపన చేశారంటే నిర్వాసితులను ఎంత మోసం చేస్తున్నారో అర్థం అవుతుందన్నారు. కలెక్టర్ నిర్వాసితులతో సమావేశం నిర్వహించి సమస్యలు తెలుసుకుని పరిష్కారం చేయాల కోరారు. రైతులకు, కూలీలకు, దళితులకు, మత్స్యకారులకు చట్టం ప్రకారం పూర్తి స్థాయిలో పరిహారం, ప్యాకేజీ ఇచ్చిన తర్వాత మాత్రమే పనులు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పిటిసి కాసులమ్మ, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.అప్పలరాజు, బుచ్చిరాజుపేట, అమలాపురం గ్రామ సర్పంచ్‌లు కాళ్ళ శ్రీనివాసరావు, పెదపూడి శంకర్రావు, నాయకులు పి.గంగరాజు, పి.సత్తయ్య, ఆర్.గోవింద్, పి.తాతీలు, ఎం.బాబ్జీ, నరసింగరావు, వి.శివ, ఎం.మహేష్ బాబు, జి.సోమేశ్వరరావు, ఎస్.అప్పలరాజు, పి.నాగరాజు, బి.అప్పలరాజు, సిహెచ్ సోమేష్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న నాయకులు, నిర్వాసితులు

108లో గర్భిణి ప్రసవం

-తల్లీ బిడ్డ క్షేమం

ప్రజాశక్తి-ఎస్.రాయవరం: మండలంలోని గుర్రాజుపేట గ్రామానికి చెందిన గర్భిణీ ఎస్.నాగమణి 108లో సుఖ ప్రసవించిది. గ్రామానికి చెందిన ఆమెకు పురిటి నొప్పులు ప్రారంభం కావడంతో 108 కాల్ సెంటర్‌కి ఫోన్ చేశారు. పాయకరావుపేట 108 సిబ్బంది గుర్రాజుపేట చేరుకొని అనకాపల్లి ఎన్టీఆర్ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యంలో పురిటినొప్పులు అధిక మయ్యాయి. స్పందించిన ఈఎమ్టి శ్రీనివాస్ తన అనుభవాన్ని ఉపయోగించి చాకచక్యంగా 108 వాహనంలోనే డెలివరీ చేశారు. అనంతరం ఎన్టీఆర్ ఆసుపత్రికి తరలించారు.ఈఎమ్టి, సిబ్బందిని పలువురు అభినందించారు.

శిశువుతో ఇఎంటి

కరపత్రాలు ఆవిష్కరిస్తునన ఐద్వా నేతలు

ఐద్వా జాతీయ సమావేశాలను

జయప్రదం చేయండి

ప్రజాశక్తి -అరకులోయ రూరల్: ఈ నెల 23 నుండి 25 వరకు జరిగే ఐద్వా జాతీయ కార్యవర్గ సమావేశాలను జయప్రదం చేయాలని ఐద్వా రాష్ట్ర కమిటీ సభ్యురాలు, ఆదివాసి గిరిజన మహిళా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.హైమావతి, జిల్లా అధ్యక్షులు టీ.కౌసల్య, రాష్ట్ర కమిటి సభ్యులు వి వి జయ పిలుపునిచ్చారు.గురువారం అరకువేలి ఆదివాసీ గిరిజన భవనంలో స్థానిక విలేకరులతో వారు మాట్లాడుతూ, అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం దేశవ్యాప్తంగా మహిళా పరిరక్షణకు, మహిళా అభ్యున్నతికి కృషి చేస్తుందని అన్నారు. ఈ నెల 23,24,25 తేదీల్లో జాతీయ సమావేశాలకు విశాఖ వేదిక కావడం హర్షించదగ్గ విషయమన్నారు.దేశంతో రోజు రోజుకు మహిళలపై హింస పెరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళలకు సామాజికంగా, ఆర్థికంగా రాజకీయంగా పురుషులతో పాటు సమాన అవకాశాలు కల్పించినప్పుడే సమానత్వం సాధ్యమని చెప్పారు. బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత దేశంలో నిరుద్యోగం, పేదరికం, నిరక్షరాస్ట పెరిగాయని విమర్శించారు. బేటి బచావో బేటి పడావో అన్న మాట నినాదంగానే మిగిలి పోయిందని అన్నారు. కేంద్రం ప్రశ్నించే గొంతును నొక్కే ప్రయత్నం చేస్తోందని విమర్శించారు.ఈ సదస్సుకు విద్యార్థులు, యువకులు, కార్మికులు, శ్రామిక మహిళలు, అభ్యుదయవాదులు, మేధావులు తరలి వచ్చి జయప్రదం చేయాలని పిలపునిచ్చారు. ఈ సమావేశంలో అరుకు మండల అధ్యక్ష కార్యదర్శులు భాగ్యవతి, శశికళ, అనంతగిరి మండలం అధ్యక్ష కార్యదర్శులు దేవుడమ్మ, కాసులమ్మ, డుంబ్రిగూడ అధ్యక్ష కార్యదర్శులు కుమారి,కుసుమ, తదితరులు పాల్గొన్నారు.

టెన్త్ పరీక్షలకు పటిష్ట చర్యలు

ప్రజాశక్తి-పెదబయలు: పదవ తరగతి పరీక్షలకు పటిష్ట చర్యలు చేపడుతున్నట్లు జిల్లా విద్యాశాఖధికారి బ్రహ్మాజీ తెలిపారు. గురువారం మండల కేంద్రంలో ఆకస్మికంగా పర్యటించారు. బాలుర రెసిడెనీ యల్ పాఠశాల సమావేశం మందిరంలో మండల ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. అనంతరం గురుకుల పాఠశాలను తరగతి గదులను పరిశీలించారు. బోధనపై విద్యార్థులను అడిగి తెలుసుకొన్నారు. ఆంగ్ల మాధ్యమ పుస్తకాలు చదించారు. ఆయన ప్రజాశక్తి తో మాట్లాడుతూ, పది పరిక్షల్లో ఎటువంటి అవంతరాలు కలుగకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నామన్నారు.

హోరెత్తిన సమ్మె ప్రచారం

-పలు చోట్ల నిరసన ర్యాలీలు

పజాశక్తి-విలేకర్ల బృంద

వైజాగ్ స్టీల్‌ప్లాంట్, ఆయిల్ పరిశ్రమలు, ప్రభుత్వ రంగ సంస్థలు, కార్మిక రక్షణ చట్టాల పరిరక్షణ, లేబర్ కోడ్‌లు రద్దు, రైతుల పంటలకు గిట్టుబాటు ధరలు తదితర సమస్యల్లో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ఈనెల 16న దేశవ్యాప్త పారిశ్రామిక సమ్మె, గ్రామీణ భారత్ బంద్‌ను జయప్రదం చేయాలని పలు సంఘాల నేతలు ప్రచారం చేపట్టారు. ఈ మేరకు

విశాఖలో పోస్టర్ ఆవిష్కరిస్తున్న లక్ష్మయ్య తదితరులు

విశాఖ కలెక్టరేట్ : రోడ్డు రవాణా డ్రైవర్లకు ఉరితాడు వంటి సెక్షన్ 106 (1, 2), మోటారు ట్రాన్స్‌పోర్టు సవరణ చట్టం 2019, జిఒ నెంబర్ 21ని రద్దు చేయాలని, డ్రైవర్లుకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, పెట్రోల్, డీజిల్‌లో పన్ను మినహాయింపు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం జరగనున్న రవాణా బంద్‌ను జయప్రదం చేయాలని ఆలిండియా రోడ్డు ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ ఫెడరేషన్ (ఎఐఆర్‌టిడబ్ల్యుఎఫ్) జాతీయ ప్రధాన కార్యదర్శి ఆర్.లక్ష్మయ్య విజ్ఞప్తి చేశారు. గురువారం జగదాంబ దరి సిఐటియు కార్యాలయంలో బంద్‌కు సంబంధించిన పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రవాణా రంగ కార్మికుల ద్వారా ప్రభుత్వాలకు లక్షల కోట్ల రూపాయలు ఆదాయం వస్తున్నప్పటికీ మోటారు కార్మికుల సంక్షేమానికి ఎటువంటి చట్టమూ లేకపోవడం శోచనీయమన్నారు. కేరళ, తమిళనాడు, పశ్చిమ బెంగాల్, ఢిల్లీ రాష్ట్రాల తరహాలో సమగ్ర సంక్షేమ చట్టాన్ని చేయాలని, వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో విశాఖ జిల్లా మోటార్ ట్రాన్స్ పోర్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) గౌరవ అధ్యక్షులు బి.జగన్ అధ్యక్ష, కార్యదర్శులు శివ, జి.అప్పలరాజు పాల్గొన్నారు.

సమ్మె జయప్రదానికి సిఐటియు పిలుపు

శుక్రవారం జరిగే సమ్మెను, కార్మిక ప్రదర్శనలను జయప్రదం చేయాలని సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్ పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆయన గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. సమ్మె సందర్భంగా శుక్రవారం ఉదయం 10 గంటలకు విశాఖ నగరంలో సరస్వతి పార్కు నుండి కార్మిక ప్రదర్శన జరుగుతుందన్నారు. కార్మికులు పెద్దఎత్తున పాల్గొనాలని కోరారు.

ములగాడ : వైజాగ్ స్టీల్‌ప్లాంట్, ఆయిల్ పరిశ్రమలు, ప్రభుత్వ రంగ సంస్థలు, కార్మిక రక్షణ చట్టాల పరిరక్షణ, లేబర్ కోడ్‌లు రద్దు, రైతుల పంటలకు గిట్టుబాటు ధరలు తదితర సమస్యల్లో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ఈనెల 16న దేశవ్యాప్త పారిశ్రామిక సమ్మె, గ్రామీణ భారత్ బంద్‌ను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి ఎం జగ్గునాయుడు, ఐఎన్‌టియుసి జిల్లా కార్యదర్శి బి.నాగభూషణం, ఎఐటియుసి జిల్లా నాయకులు కె.సత్యనారాయణ, టిఎన్‌టియుసి జిల్లా అధ్యక్షుడు ఎన్ లక్ష్మణరావు పిలుపునిచ్చారు. గురువారం హెచ్‌పిసిఎల్ గేటు వద్ద కాంట్రాక్టు కార్మికుల గేట్ మీటింగ్‌లో మాట్లాడుతూ, అశేష త్యాగాలు చేసి కార్మికవర్గం సాధించుకున్న కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్స్‌గా మార్చి, కార్మికులను యజమాన్యాలకు కట్టు బానిసలుగా చేయాలని చూస్తోందని దుయ్యబట్టారు. హెచ్‌పిసిఎల్‌లో కాంట్రాక్టు కార్మికుల హక్కులను కాంట్రాక్టర్లు కాలరాస్తుంటే, యాజమాన్యం చోద్యం చూస్తోందని మండిపడ్డారు.కార్యక్రమంలో సిఐటియు జోన్ నాయకులు కె.పెంటారావు, పి.పైడిరాజు, పి సురేష్, రమణ ఎస్.వాసు ఏసుబాబు గంగాధర్ బూడి.శ్రీను ప్రేమ్, రాజు నీలయ్య, గణేష్, హెచ్‌పిసిఎల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ సిఐటియు, ఐఎన్‌టియుసి, ఎఐటియుసి, టిఎన్‌టియుసి నాయకులు జి నరేష్, కె.తాతబాబు, ఎ.అజయ్, పి.కృష్ణ పాల్గొన్నారు.

గాజువాకలో...

తగరపువలస: కేంద్రప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా శుక్రవారం జరుగు పారిశ్రామిక సమ్మెను జయప్రదం చేయాలని సిపిఎం, సిపిఐ నాయకులు పిలుపు నిచ్చారు. చిట్టివలస సిపిఐ కార్యాలయంలో సమ్మె జయప్రదంపై చర్చించారు. నాయకులు రవ్వ నరసింగరావు, కానూరి రాంబాబు పాల్గొన్నారు.

నర్సీపట్నంలో....

మధురవాడ : ప్రభుత్వాల కార్మిక విధానాలకు వ్యతిరేకంగా శుక్రవారం పారిశ్రామిక సమ్మె, గ్రామీణబంద్‌ను జయప్రదం చేయాలని విశాఖ ఆటో రిక్షా కార్మిక సంఘం, సిఐటియు జిల్లా కమిటీ అధ్యక్షులు పి.రాజ్‌కుమార్ పిలుపునిచ్చారు. వాంబేకాలనీలో కనకదుర్గా విఘ్నేశ్వర మొగధారమ్మ ఆటో సంఘం, సిఐటియు సంయుక్త ఆధ్వర్యాన మోటార్ బంద్‌పై మాట్లాడారు. బంద్‌లో అన్ని వర్గాల కార్మికులు పాల్గొనాలని, ప్రజలు సహకరించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ప్రెసిడెంట్ రాము, అప్పారావు, నాగేశ్వర్ , బుచ్చయ్య పాల్గొన్నారు.

మధురవాడ : ముఠా కార్మికుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం బోర్డును ఏర్పాటు చేసి చట్టాన్ని రూపొందించాలని ముఠాజట్టు హమాలి వర్కర్స్ యూనియన్ , ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.మన్మధరావు డిమాండ్ చేశారు.16న బంద్ జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

అనకాపల్లిలో..

సిపిఐ మధురవాడ జోన్ కార్యదర్శి వి. సత్యనారాయణ మేస్త్రి ముద్దాడ బంగారయ్య, సూరి వెంకటరెడ్డి పడగల కష్ణ, కొల్లి చిన్నారావు,కళాసీలు పాల్గొన్నారు.

గాజువాక: దేశవ్యాప్త సమ్మెను జయప్రద చేయాలని భెల్ మెయిన్‌గేటు వద్ద గురువారం రెండో రోజు నిరసన చేపట్టారు. కేంద్ర ప్రభుత్వ కార్మిక, ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా చేపట్టే సమ్మెను జయప్రదం చేయాలని, ఎఐటియుసి జిల్లా కార్యదర్శి పట్నాయక్ పిలుపునిచ్చారు గుర్తింపు యూనియన్ ప్రధాన కార్యదర్శి, ఎస్.సాహు, ఉరుకూటి బాబురావు, జిటిపి ప్రకాష్, సీత నాయుడు, పివిఎన్ రాజు, ఎస్ జగన్నాధ రావు పాల్గొన్నారు.

గాజువాక: ముఠా కార్మికులకు సమగ్ర చట్టం చేయాలని సిఐటియు నాయకులు ఎం రాంబాబు డిమాండ్ చేశారు. గాజువాకలో ముఠా కార్మికులతో సమావేశంలో ఈనెల 16న సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. స్టీల్ ప్లాంట్ పరిరక్షణకు ముఠా కార్మికులు ప్రతిజ్ఞ చేశారు.

నర్సీపట్నం టౌన్

మున్సిపల్ కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలకు వెంటనే జీఓలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ గురువారం నర్సీపట్నం పాత మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి అడిగర్ల రాజు మాట్లాడుతూ, మున్సిపల్ కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ కార్మికులు 2023 డిసెంబరు 26 నుండి జనవరి 12వ తేదీ వరకు తమ సమస్యలు పరిష్కరించాలని సమ్మె చేశారన్నారు. దీనికి స్పందించిన ప్రభుత్వం కార్మికులకు ఇచ్చిన హామీలు మినిట్స్ ఇచ్చి కొన్నింటికి మాత్రమే జీఓలు ఇచ్చి మిగులు వాటికి ఇవ్వలేదన్నారు. సమ్మె కాలం వేతనంకు సమాన రోజులు పని చేయాలని పెట్టిన షరతును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ ఫెడరేషన్ నాయకులు కుపరాల రాజు, రమణ, కుమారు, ప్రసాద్ తదితర్లు పాల్గొన్నారు.

నూతన మోటారు వాహన చట్టాన్ని రద్దు చేయాలి

అనకాపల్లి : కేంద్ర బిజెపి ప్రభుత్వం తీసుకొచ్చిన భారతీయ న్యాయ సంహిత చట్టంలోని 106 క్లాజ్ 1, 2 డ్రైవర్లకు ఉరితాడువంటివని, దానిని వెంటనే రద్దు చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్ శంకరరావు డిమాండ్ చేశారు. ఆలిండియా రోడ్ ట్రాన్స్పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ ఇచ్చిన పిలుపులో భాగంగా డ్రైవర్లు ఫిబ్రవరి 16న సమ్మెలో పాల్గొనాలని కోరారు. సిఐటియు అనకాపల్లి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో డ్రైవర్లలో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా శంకరరావు మాట్లాడుతూ కేంద్ర బిజెపి ప్రభుత్వం తీసుకువచ్చిన చట్టం ప్రకారం.. ప్రమాదం జరిగి ఎవరైనా మరణిస్తే డ్రైవర్‌కి 10 సంవత్సరాలు జైలు శిక్ష, పది లక్షల జరిమానా విధించాలని నిర్ణయించిందని, దీనివలన డ్రైవర్లు చాలా ఇబ్బందులు పడతారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి పి చలపతి తదితరులు పాల్గొన్నారు.

వడ్డాది : ఈ నెల 16న జరగనున్న పారిశ్రామిక సమ్మె, గ్రామీణ బంద్‌ను జయప్రదం చేయాలని కోరుతూ వడ్డాది కూడలిలో రైతు, కార్మిక సంఘాల ఆధ్వర్యాన ప్రచారం చేశారు. ఢిల్లీలో రైతుల పట్ల మోడీ ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరుపై నిరసన తెలిపారు. కార్యక్రమంలో రైతు సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రెడ్డిపల్లి అప్పలరాజు, నాయకులు రావడ వరహాలు, వర్రి సూరిబాబు, దాసరి కొండబాబు, నాయుడు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వడ్డాదిలో...